తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 92 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 బుధవారం 04 - 11 - 2026 వెల రూ. 2 రూ/

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో నిరంతరం సంప్రదింపులు జరపండి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం
- తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు
- మహారాష్ట్రలో ముంపు భూములకు పరిహారం చెల్లించడానికి సిద్ధమని స్పష్టం చేశారు
- తుమ్మిడిహట్టిపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



హైదరాబాద్ :

తుమ్మిడిహట్టి బ్యారేజ్‌పైన మహారాష్ట్రతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే జరిగిన ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్రకు అందజేయాలని సీఎం స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టిపై అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష చేశారు.మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ఇతర అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. అవసరమైన నిధులను జాయింట్ అకౌంట్‌లో ఉంచుతామని చెప్పారు. భూముల ముంపుపై మహారాష్ట్ర ఎలాంటి సర్వే చేయించుకున్నా తమకు అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర అధికారులకు కావాల్సిన సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ రమేష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పెంపు



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు గడువు పెంపినట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు
- డిసెంబర్ 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారు
- ఎమ్మెల్సీ ఓటు నమోదుకు దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్ :

తెలంగాణ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ చివరి రోజు వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గంలోని - మిగతా 2 లో



'దమ్మీలు ఇస్తే భయపడేవాళ్లం కాదు'

- అమిత్ షాకు మంత్రి అడ్లూరి కౌంటర్!
- అమిత్ షా పర్యటనపై మంత్రి అడ్లూరి విమర్శలు
- తప్పులుంటే బయటపెట్టాలని కేంద్రానికి సవాల్
- దమ్మీలకు భయపడబోమని వ్యాఖ్య
- ఎస్‌ఐఆర్‌తో ఓట్ల తొలగింపునకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపణ

హైదరాబాద్ :

కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం - మిగతా 2 లో

'ఒకే వేదికపై ఎప్పుడూ నిరసనలంటే ఎలా?'

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- నిరసన స్థలాన్ని నిరవధికంగా ఆక్రమించరాదని కీలక వ్యాఖ్య
- ఢిల్లీలో నిరసనలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ
- రూ.12,000 కోట్ల వరకు నష్టపోయామని తెలిపిన వ్యాపార సంఘాలు
- కేసులో నిరసన నిర్వాహకులను చేర్చాలని ధర్మాసనం ఆదేశం
- నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, ఒకే ప్రాంతాన్ని నిరవధికంగా ఆక్రమించుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది



ఢిల్లీ :

పండుగల సీజన్‌లో నిరసనల పేరుతో ఒకే ప్రాంతాన్ని నిరవధికంగా ఆక్రమించుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆందోళనలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరికీ హక్కు ఉన్నప్పటికీ, వాటికి నిర్దిష్ట సమయంతోపాటు - మిగతా 2 లో

వందలాది చిన్న సిటీలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చాలి



- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు
- దేశంలోని వందలాది చిన్న పట్టణాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా మార్చాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు
- పుణె మెట్రో ప్రాజెక్టు ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈకీలక వ్యాఖ్యలు చేశారు

ఢిల్లీ :

మన దేశంలోని వందలాది చిన్న పట్టణాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతాలు కేవలం నివసించే ప్రదేశాలు మాత్రమే కాదని, దేశ ఆర్థిక కార్యకలాపాలకు అవి ప్రధాన కేంద్రాలని ఆయన నొక్కి చెప్పారు. రూ.21,800 కోట్లతో నిర్మించిన పుణె మెట్రో ప్రాజెక్టును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. పింక్ లైన్ అని పిలిచే పూణె మెట్రో లైన్‌3ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ - మిగతా 2 లో

అన్ని అపోహలు పటాపంచలు



- భారత సౌర పరిశోధక ఉపగ్రహం ఆదిత్య-ఎల్1 కీలక ఆవిష్కరణ
- సౌర జ్వాలలు (సీఎంఈలు) ఒకేలా విస్తరించవని తొలిసారి గుర్తింపు
- ఉపగ్రహాలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ల భద్రతకు ఈ అధ్యయనం ఎంతో కీలకం
- భారతీయ ఖగోళ భౌతిక శాస్త్ర సంస్థ పరిశోధకుల ఘనత - మిగతా 2 లో

ముందే వచ్చిన కాలుష్య సంక్షోభం



- ఢిల్లీకి పాక్ పాగ సెగ
- దీపావళికి ముందే ఢిల్లీలో తీవ్రమైన వాయు కాలుష్యం
- 300 దాటిన గాలి నాణ్యత సూచీ.. 'వెరీ పూర్' కేటగిరీకి చేరిక
- భారత్‌తో పాటు పాకిస్థాన్‌లోని వ్యవసాయ వ్యర్థాల దహనాలే ప్రధాన కారణం
- కాలుష్య నియంత్రణకు గ్రాప్-2 చర్యలు అమలు

ఢిల్లీ :

పండుగల సీజన్ సమీపిస్తుండగా, దేశ రాజధాని ఢిల్లీని మరోసారి వాయు కాలుష్యం కమ్మేసింది. గాలి నాణ్యత సూచీ 300 మార్కును దాటడంతో - మిగతా 2 లో

పట్టణ స్థానిక ఎన్నికల్లో కూటమి సునామీ



- రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది
- ఒక్కొక్కటిగా వెలువడుతున్న మున్సిపల్ ఛైర్మన్, వార్డు మెంబర్ల ఫలితాల్లో అధికార కూటమి అభ్యర్థులు సత్తా చాటుతున్నారు

అమరావతి :

ఏపీలో పట్టణ స్థానిక ఎన్నికల్లో కూటమి హవా స్పష్టంగా కనిపిస్తోంది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ కూటమి పార్టీలు దూసుకెళ్తున్నాయి. ఇప్పటికే 17 ఏకగ్రీవాలు కాగా అందులో తెలుగుదేశం 15, జనసేన, బీజేపీ ఒక్కో చోట పాగా వేశాయి. మిగతా 70 చోట్ల ఛైర్ పర్సన్ అభ్యర్థులకు ఎన్నికలు జరగ్గా ఇవాళ ఒక్కొక్కటిగా వెలువడుతున్న ఫలితాల్లో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేస్తున్నారు.వైఎస్ జగన్ కంచుకోట పులివెందుల పురపాలక సంఘాన్ని కూటమి కైవసం చేసుకుంది. మొత్తం 40 వార్డుల్లో 37 చోట్ల కూటమి గెలుపొందగా,మూడు వార్డుల్లో వైఎస్సార్సీపీ విజయం సాధించింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి గీతాకుమారి విజయం సాధించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మున్సిపాలిటీలో కూటమి క్లీన్ స్వీప్ చేసింది. 23 వార్డులను కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారు. టీడీపీ-21 వార్డులను కైవసం చేసుకుంది. జనసేన, బీజేపీ చెరో స్థానంలో విజయం సాధించాయి. ఛైర్‌పర్సన్‌గా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి - మిగతా 2 లో



కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!

- మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై స్పందించిన వైసీపీ అధినేత జగన్
- చంద్రబాబు, పోలీసులు, ఎన్ఈసీకి కంగ్రాట్స్ అంటూ వ్యంగ్యం
- ఇవి ఎన్నికలు కాదని, ఏకపక్షంగా జరిగిన సెలక్షన్లని ఆరోపణ
- నామినేషన్ల నుంచి కౌంటింగ్ వరకు ప్రక్రియను హైజాక్ చేశారని విమర్శ

అమరావతి :

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కూటమి ప్రభంజనం సృష్టిస్తున్న వేళ, వైసీపీ అధినేత జగన్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియ ఏకపక్షంగా జరిగిందని ఆరోపిస్తూ, ఇవి ఎలక్షన్లు కావని, సెలెక్షన్లు అని ఆయన వ్యంగ్యం ప్రదర్శించారు. - మిగతా 2 లో

ఆర్టీజీఎస్, టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- అర్నబ్, మురసు తుఫాన్లపై ఆర్టీజీఎస్‌లో సీఎం మీడియా సమావేశం
- ప్రాణ నష్టం నివారించి, ఆస్తి నష్టం తగ్గించగలిగామన్న చంద్రబాబు
- టెక్నాలజీ సాయంతో 90 శాతం కచ్చితత్వంతో అంచనాలు
- రికార్డు సమయంలో విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ
- సహాయక చర్యల్లో సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని కితాబు



అమరావతి :

రాష్ట్రంపై వరుసగా విరుచుకుపడిన అర్నబ్, మురసు తుపానులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని, టెక్నాలజీని వాడుకుంటూ పక్కా ప్రణాళికతో పనిచేయడం వల్లే ప్రాణనష్టాన్ని నివారించగలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ) కేంద్రం నుంచి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుఫాన్ సహాయక చర్యల్లో ప్రభుత్వ యంత్రాంగం స్పందించిన తీరును ఆయన వివరించారు.తుపాను సహాయక చర్యల్లో భాగంగా రెస్క్యూ, రిలీఫ్, పునరావాసం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామని ఆయన తెలిపారు. "ఈ రెండు తుపానుల గమనాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, గాలుల వేగాన్ని విశ్లేషించుకుంటూ ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులకు పక్కా సమాచారం అందించగలిగాం. 'అవేర్' వేదిక ద్వారా విశ్లేషించుకుని, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నాం. గాలుల వేగం, వర్షపాతం, వరద నిర్వహణ వంటి అంశాలను 90 శాతం కచ్చితత్వంతో అంచనా వేశాం. ఈ అంచనాలను క్షేత్రస్థాయి వాస్తవాలతో పోల్చి చూసినప్పుడు మా విశ్లేషణ నిజమని తేలింది" అని చంద్రబాబు పేర్కొన్నారు.ఈ ముందస్తు అంచనాల వల్లే ముంపు గ్రామాలను ముందుగానే గుర్తించి, ప్రభావిత ప్రాంతాల్లో సహాయక - మిగతా 2 లో

సంపాదకీయం

మదరాసు తెలుగు బావుటా

మద్రాసు నగరంలో మైలాపూర్‌లోని లజ్ కార్నర్ సమీపాన, రాయపేట హైరోడ్‌లో గల 126వ నెంబరు ఇంట్లో ఆంధ్రరాష్ట్ర సాధనకై పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష చేశారు. 1952 అక్టోబర్ 19న ప్రారంభించిన దీక్ష 58వ రోజున... డిసెంబర్ 15 రాత్రి 11 గంటల 20 నిమిషాలకు తనువు చాలించారు. ఫలితంగా 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.1953 అక్టోబర్ 1న ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తర్వాత... పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసిన స్థలం ఉన్న ఇంటిని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అయితే ఏడాది లోపే ప్రకాశం ప్రభుత్వం పడిపోవడంతో అది అక్కడితోనే ఆగిపోయింది. 1956 నవంబర్ 1న భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాట్లలో భాగంగా కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలతో పాటు నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రూపుదిద్దుకుంది. బులుసు సాంబమూర్తి, తెన్నేటి విశ్వనాథం పూనికతో నీలం సంజీవరెడ్డి ప్రభుత్వం పొట్టి శ్రీరాములు ప్రాయోపవేశం చేసిన ఇంటిని కొనుగోలు చేసింది.ఈ ఇంటిలోనే 'పొట్టి శ్రీరాములు మిషన్' కార్యక్రమాలు నిర్వహించేవారు. 1958లో దీనిని 'పొట్టి శ్రీరాములు ట్రస్ట్ సమితి'గా మార్చారు. ప్రకాశం పంతులుకు కొంతకాలం కార్యదర్శిగా పనిచేసిన వై.ఎస్ శాస్త్రికి ఈ కార్యక్రమాల బాధ్యతను అప్పజెప్పారు. ఒకవైపు స్వాతంత్ర్యం రావడం, మరోవైపు భాష ఆధారంగా తెలుగు రాష్ట్రం ఏర్పడటంతో చాలా విలువైన కార్యక్రమాలు అక్కడ సాగాయి. 1964 ఏప్రిల్ 19న పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఆవిష్కరించారు. ఆ భవనంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అక్కడ క్రమం తప్పకుండా సాహిత్య, సాంస్కృతిక సమావేశాలు జరిగేవి. ప్రముఖ పాత్రికేయులు బి.ఎస్.ఆర్.కృష్ణ ద్వారా అమరజీవి స్మారక కేంద్రం పరిస్థితి తెలుసుకున్న అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఎంతో చలించి, 20 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఒకవైపు ధరలు పెరగడం, మరోవైపు పెద్ద భవనం కావాలనే ఆలోచన రావడంతో ఆ 20 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా మారింది.2000 అక్టోబర్ 2న భవన పునర్నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. దాచి ఉంచిన సొమ్ము సరిపోకపోయినా ఎల్ అండ్ టీ రామకృష్ణ తోడ్పాటుతో మూడంతస్తుల భవనం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్ అప్పటి గవర్నర్ డా. పి.రంగరాజన్ పునర్నిర్మాణమైన భవనాన్ని 2001 నవంబర్ 18న ప్రారంభించారు. క్రింది అంతస్తులో పొట్టి శ్రీరాములు కన్నుమూసిన చోట నెలకొని ఉన్న విగ్రహంతో పాటు ఎంతోమంది తెలుగు ప్రముఖుల ఫొటోలు అక్కడ ఉన్నాయి. మొదటి అంతస్తులో చక్కని సమావేశ మందిరంతో పాటు రెండో అంతస్తులో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. కొత్త జవసత్వాలు పుంజుకోవడంతో కార్యక్రమాలు అద్భుతంగా సాగాయి.2015 తర్వాత మండలి బుద్ధప్రసాద్ చొరవతో ప్రక్షాళన మొదలై, ప్రభుత్వ యాజమాన్యంలో కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ యాజమాన్యంలో సాగే ఈ సంస్థకు ఏడేళ్ల క్రితం అంటే 2018--20 మధ్య రెండు విడతలుగా ప్రభుత్వ నిధులు వచ్చి ఆగిపోయాయి. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసిన ఆ స్థలం... చెన్నైలో పర్యటించే ప్రతి తెలుగు ప్రముఖుడు వెళ్లి దర్శించుకుని వచ్చేలా ఉండాలి. గత సంవత్సరం ఈ భవనానికి 'త్యాగ భవనం' అని నామకరణం చేస్తున్నట్టు చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ఒకసారి వెళ్లి వచ్చి, పెద్ద ఎత్తున కార్యక్రమాలు రూపొందేలా చూడాలి. ఇది మద్రాసులోనే కీలకమైన పర్యాటక స్థలంగా మారాలి.అలాగే ఆంధ్రప్రదేశ్ విద్యార్థినీ విద్యార్థులు పొట్టి శ్రీరాములు గురించి పూర్తిగా తెలుసుకునే రీతిలో పాఠ్యాంశాలు మార్పు చేయాలి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పక్షాన పొట్టి శ్రీరాములు త్యాగపూరిత జీవితం స్ఫూర్తిమంతమైన సినిమాగా రూపొందాలి. తర్వాత అది ఇతర దక్షిణాది భాషలతో పాటు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లోకి అనువాదం కావాలి. ఈ సినిమా ద్వారా సామాన్య ప్రజలు పొట్టి శ్రీరాములు త్యాగమయమైన జీవితాన్ని తెలుసుకోవాలి. ప్రస్తుతం 15,000 గ్రంథాలతో ఉన్న లైబ్రరీ మరింత ప్రవర్ధమానమవ్వాలన్నా, నిత్యం పర్యాటకులు చూడటానికి అనువుగా మారాలన్నా, ఇంకా ఆ మందిరంలో కార్యక్రమాలు చురుకుగా జరగాలన్నా నిర్వహణకు పూర్తిస్థాయి ఉద్యోగి అవసరం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలి.

ఆర్టీజీఎస్, టెక్నాలజీతో తుపానుల గండం గట్టెక్కాం

మొదటిపేజీ తరువాయి - సిబ్బందిని, అవసరమైన పరికరాలను మోహరించగలిగామని ఆయన చెప్పారు. అధికార యంత్రాంగాన్ని ఉన్నతస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు కదిలించి, పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు తీసుకురాగలిగామని అన్నారు.విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని, రాష్ట్రవ్యాప్తంగా 31 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, 4095 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని సీఎం తెలిపారు. 548 సబ్ స్టేషన్ల నుంచి సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. "సాధారణంగా ఇంతటి నష్టాన్ని పూడ్చడానికి కనీసం 20 రోజులు పడుతుంది. కానీ పక్కా ప్రణాళికతో కేవలం 4 నుంచి 5 రోజుల్లోనే విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టగలిగాం" అని చంద్రబాబు వివరించారు.విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పనిచేశారని సీఎం ప్రశంసించారు. కుండపోత వర్షంలోనూ విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారని, కూలిన చెట్లను తొలగిస్తూనే స్తంభాలు వేశారని గుర్తుచేశారు. ఆక్వా చెరువుల్లో పడిపోయిన స్తంభాలను సైతం తిరిగి నిలబెట్టారని, ఈ ప్రక్రియ కోసం పెద్ద ఎత్తున డ్రిల్లింగ్ మిషన్లను వినియోగించామని వివరించారు. ఈ సహాయక చర్యల్లో విద్యుత్ సిబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేశారని చంద్రబాబు అభినందించారు. మొత్తం మీద, ముందస్తు అంచనాలు, టెక్నాలజీ వినియోగం, అధికార యంత్రాంగం సమన్వయం, సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే తుపానుల ప్రభావాన్ని వీలైనంత త్వరగా అధిగమించి, సాధారణ పరిస్థితులు నెలకొల్పగలిగామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పెంపు

మొదటిపేజీ తరువాయి - అర్హులు ఓటు కోసం ఈ నెల 6 వరకు ఫారం 18 సమర్పించాలని సీఈవో పేర్కొన్నారు.ఈ నెల 6 వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ముసాయిదా జాబితా ప్రచురించిన తర్వాత ఈ నెల 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల సమయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిశీలించి వచ్చే నెల 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత కూడా నామినేషన్ల గడువు చివరి రోజు వరకు కూడా గ్రాడ్యుయేట్లు ఓటు కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు."గ్రాడ్యుయేట్ ఓటు నమోదు కార్యక్రమం అనేది నిరంతర ప్రక్రియ. దరఖాస్తు చేసుకోవడానికి చివరితేదీ ఈ నెల 6. ఈ ఫామ్-18 ని డ్రాఫ్ట్ రూపంలో ఈ నెల 25న పబ్లిష్? చేయడం జరుగుతుంది. నవంబరు 25 నుంచి డిసెంబరు 12 వరకు అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయవచ్చు. ఈ అభ్యంతరాలు తెలిపే సమయంలో కూడా ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తర్వాత వెరిఫికేషన్ కోసం మరో పదిహేను రోజులు ఉంటాయి. ఆ తర్వాత ఫైనల్ పబ్లికేషన్ అనేది డిసెంబరు 30న జరుగుతుంది. ఆ పబ్లికేషన్? తర్వాత కూడా నామినేషన్ తేదీ వరకు ఫామ్-18 ఇచ్చి నమోదు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది".

కంగ్రాట్స్ చంద్రబాబు టీమ్!

మొదటిపేజీ తరువాయి - చంద్రబాబు, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి జగన్ వ్యంగ్యంగా అభినందనలు తెలిపారు. "ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే ఇవ్వకుండా ఎన్నికల్లో అద్భుతంగా ఎలా గెలవచ్చో నిరూపించినందుకు చంద్రబాబు టీమ్, పోలీసులు, ఎస్ఈసీకి కంగ్రాట్స్!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నామినేషన్ల దగ్గరి నుంచి మొదలుకొని స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణ, పోలింగ్ ఏజెంట్ల నియామకం, పోలింగ్ సరళి, పోలింగ్ శాతం, చివరకు కౌంటింగ్ వరకు ప్రతీ దశను అధికార పక్షం హైజాక్ చేసిందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అభ్యర్థులను ప్రజలు ఎన్నుకోలేదని, అధికార పార్టీయే వారిని సెలెక్ట్ చేసిందని ఎద్దేవా చేశారు.ఈ పరిణామాల నేపథ్యంలో దేశంలో ఎన్నికల సంస్కరణలు ఎంత అవసరమో స్పష్టమవుతోందని జగన్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి భారీ విజయం దిశగా దూసుకెళుతుండగా, వైసీపీ అనేకచోట్ల పరాజయం పాలవుతున్న నేపథ్యంలో జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

'దమ్మీలు ఇస్తే భయపడేవాళ్లం కాదు'

మొదటిపేజీ తరువాయి - తప్పులు చేస్తే కేంద్ర హోంశాఖ చేతిలో ఉన్న అధికారాలతో వాటిని బయటపెట్టాలని సవాల్ విసిరారు. జనాలను పోగేసి దమ్మీలు ఇస్తే భయపడేవాళ్లు ఇక్కడ ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ పేరు చెబితే బీజేపీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాలు కాంగ్రెస్‌కు అండగా ఉన్నందునే వారి ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బీజేపీ ఉపయోగించుకుంటోందని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని అద్దూరి డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీలు కోరుతున్నా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న ఉద్దేశమేంటని నిలదీశారు. రాజ్యాంగం ద్వారా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రజలకు కల్పించిన ఓటు హక్కును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా వెనుక అదానీ, అంబానీ ఉన్నారని మంత్రి ఆరోపించారు. దేశ సంపదను ఆ ఇద్దరు పారిశ్రామికవేత్తల చేతుల్లో పెడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఎన్నికల ప్రక్రియపై బీజేపీని లక్ష్యంగా చేసుకుని అద్దూరి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పట్టణ స్థానిక ఎన్నికల్లో కూటమి సునామీ

మొదటిపేజీ తరువాయి - త్రివేంద్రమూర్తి ప్రత్యర్థి వైఎస్సార్సీపీ అభ్యర్థి కె.శ్రీనివాసులపై 6353 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. పుట్టపర్తి పురపాలికలోనూ జనసేన జెండా పాతింది. పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎమ్.ఈశ్వర్ గెలుపొందారు.కృష్ణా జిల్లా ఉయ్యూరు మున్సిపాలిటీలో పసుపు జెండా ఎగిరింది. ఉయ్యూరులోని 32 వార్డుల్లో టీడీపీ 21, జనసేన 7 స్థానాలు కైవసం చేసుకున్నాయి. వైఎస్సార్సీపీ 2 చోట్ల మాత్రమే ప్రభావం చూపగలిగింది. పురపాలిక ఛైర్మన్‌గా ప్రవీణ్ కుమార్ గెలుపొందారు. ప్రవీణ్‌కుమార్‌కు కూటమి బలం, స్థానికంగా ఉండే సంబంధాలు బాగా కలిసొచ్చాయి. పెడన మున్సిపాలిటీలో జనసేన జెండా పాతింది. ఛైర్‌పర్సన్‌గా జనసేన అభ్యర్థి బళ్లా జ్యోత్స్నారాణి విజయం సాధించారు.పెడన మున్సిపాలిటీ జనరల్ మహిళకు రిజర్వ్ అయింది. పాత కౌన్సిల్‌లో ఛైర్‌పర్సన్‌గా ఒకే పార్టీలో ఉండి చెరో రెండున్నరేళ్లు పనిచేసినవారే ఇప్పుడు వేర్వేరు పార్టీల నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ పడటం ఆసక్తి రేపింది. జనసేన అభ్యర్థిగా బరిలోకి దిగిన బళ్లా జ్యోత్స్నారాణి వైఎస్సార్సీపీ అభ్యర్థి కటకం నాగకుమారిపై 4380 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. పెడనలో బళ్లా కుటుంబానికి ఉన్న పట్టు చేనేత కుటుంబాల సహకారం జ్యోత్స్నారాణిని విజయతీరాలకు చేర్చాయి. జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ టీడీపీ అభ్యర్థి నరేంద్రుల వినీత 15,000లకు పైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 36 వార్డుల్లో టీడీపీ 26, జనసేన 7, బీజేపీ 1, వైఎస్సార్సీపీ 2 చోట్ల విజయం సాధించారు.ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీని కూటమి కైవసం చేసుకుంది. 32 వార్డుల్లో టీడీపీ 20, జనసేన 6 స్థానాల్లో విజయం సాధించారు. వైఎస్సార్సీపీ 3 వార్డులతోనే సరిపెట్టుకుంది. ఛైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి రౌంగల అనూష గెలుపొందారు. డిగ్రీ చదివిన రౌంగల అనూషకు ఆటోమొబైల్ వ్యాపారవేత్త అయిన భర్తకు లోకల్ ప్రజలతో ఉండే సంబంధాలు, కూటమి బలం ప్లస్ అయ్యింది. వైఎస్సార్సీపీ అభ్యర్థిని మేకా సత్యవతి భర్త మాజీ ఎమ్మెల్యే బాలరాజు గట్టిగా ప్రచారం చేసినా ప్రభావం చూపించలేకపోయారు.తిరుపతి జిల్లా వెంకటగిరిలో వార్ వన్‌సైడ్ అయింది. పురపాలికను టీడీపీ కైవసం చేసుకుంది. 36 వార్డుల్లో 31 చోట్ల కూటమి గెలిచింది. ఛైర్‌పర్సన్‌గా తెలుగుదేశం అభ్యర్థి దొంతు శారద విజయం సాధించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఆమె మొదటి నుంచి తన ప్రత్యర్థి బి.దీవెనపై స్పష్టమైన ఆధిక్యతను కనబర్చి విజయ ధంకా మోగించారు. శారద 2014-2019 మధ్య మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా చేశారు. ఆ తర్వాత వైఎస్సార్సీపీలో చేరి 2021లో కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌గానూ వ్యవహరించారు. అనంతరం టీడీపీ గూటికి చేరారు. పట్టణంలో బాగా ప్రభావం చూపే పద్మశాలి సామాజికవర్గానికి చెందినవారు కావడం, ఎమ్మెల్యే, ఆయన వర్గం పూర్తిగా మద్దతుగా నిలవడం కూటమి బలం శారదకు బాగా కలిసొచ్చాయి.శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘాన్ని తెలుగుదేశం కైవసం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థి గంగాభవాని విజయం సాధించారు. మొత్తం 36 వార్డుల్లో టీడీపీ 27, జనసేన 3, బీజేపీ 1 చోట గెలవగా వైఎస్సార్సీపీ 4 చోట్ల విజయం సాధించింది. గంగాభవాని రాష్ట్ర బ్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు సతీమణి. రైల్వే వంతెనను అందుబాటులోకి తేవడం, కేంద్రీయ విద్యాలయం ప్రారంభించడం, తాగునీటి కష్టాలు తీర్చేలా పనులు చేస్తుండటం, రోడ్ల రూపురేఖలు మార్చడం వంటివన్నీ కలిసొచ్చి కూటమి పాగా వేసింది.మాచర్ల పురపాలకసంఘంలో కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. 36 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థుల విజయం సాధించారు. మున్సిపల్ ఛైర్మన్?గా టీడీపీ అభ్యర్థి ఎనుముల సుమ్మ గెలుపొందారు. సూళ్లూరుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ టీడీపీ అభ్యర్థి పిట్ల సుహాసిని 8,784 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. 32 వార్డుల్లో టీడీపీ 26, జనసేన 1, బీజేపీ 2, వైఎస్సార్సీపీ 3 చోట్ల విజయం సాధించింది.

వందలాది చిన్న సిటీలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చాలి

మొదటిపేజీ తరువాయి - సందర్భంగానే ఆయన పట్టణాభివృద్ధి గురించి ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా పాల్గొన్నారు."మన పట్టణాలు కేవలం నివసించే ప్రదేశాలు మాత్రమే కాదు. అవి దేశ ఆర్థిక కార్యకలాపాలకు ప్రధాన కేంద్రాలు. మనం వందలాది చిన్న పట్టణాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చాల్సిన అవసరం ఉంది. ఈ దార్శనికతను మనస్సులో ఉంచుకునే ఈ ఏడాది అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌ను ఆమోదించాం. ఈ ఫండ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1 లక్ష కోట్ల నిధులను అందిస్తోంది. రానున్న సంవత్సరాల్లో దేశంలోని పట్టణాలకు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడమే దీని లక్ష్యం. ఇందుకోసం స్థానిక సంస్థలు, ప్రైవేటు రంగానికి చెందిన సహచరులు ముందుకు రావాలని నేను కోరుతున్నాను. మనమందరం ఒక మిషన్ మోడ్‌లో కలిసి పనిచేయాలి.కొత్తగా ప్రారంభించిన మెట్రో ప్రాజెక్టుల వల్ల పుణెలోని కొత్త, పాత ప్రాంతాల మధ్య అనుసంధానం మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. "పుణె మెట్రోలో మరొక లైన్ ఈ రోజు ప్రారంభం కావడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. పదేళ్ల క్రితం, పుణెలో ఈ ప్రాజెక్టు మొదటి దశకు శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. హింజావాడి, శివాజీనగర్ మధ్య మెట్రో సేవలు ప్రారంభం కావడంతో, పుణెలోని ఒక ప్రధాన ఐటీ హబ్‌కు ఇప్పుడు మెరుగైన రవాణా సౌకర్యం లభిస్తుంది. ఈ రోజు పనులు ప్రారంభమైన కొత్త లైన్, పుణె పాత, కొత్త ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని మరింత పటిష్టం చేస్తుంది" అని మోదీ పేర్కొన్నారు.భారతదేశం అభివృద్ధిలో పుణె పాత్రను హైలెట్ చేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మహానగరం ఐటీ, ఆటోమోటివ్, ఫార్మాస్యూటికల్స్, స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, ఉత్పాదక రంగాలకు కేంద్రంగా ఎదుగుతోందని అన్నారు. "ఈ రోజు పుణె నగరం వికసిత్ భారత్ శక్తిని చాటుతోంది. ఐటీ, ఆటోమోటివ్, ఫార్మాస్యూటికల్స్ నుంచి స్టార్టప్స్, ఆవిష్కరణలు, ఉత్పాదక రంగం వరకు అన్ని రంగాలకు కేంద్రంగా ఎదుగుతోంది. పుణె మన దేశ యువత కలలు, ఆకాంక్షల వేదిక. స్థానిక మెట్రో కనెక్టివిటీ బలోపేతం కావడం పుణె నగరాభివృద్ధికి సరికొత్త వేగాన్ని అందించనుంది" అని మోదీ అన్నారు.మెట్రో లైన్ కోసం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య నమూనా (గ్రా)ను అనుసరించినట్లు ప్రధాని మోదీ చెప్పారు. "ఈ మెట్రో ప్రాజెక్టు ప్రభుత్వ-ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో నిర్మించారు. ఇది దేశ పురోగతిని మరింత వేగవంతం చేసే విజయవంతమైన నమూనా. మిత్రులారా, ఈ రోజు భారతదేశంలోని ప్రతి పౌరుడు, యువతీ యువకులు వికసిత్ భారత్ నిర్మాణానికి పూర్తి అంకిత భావంతో పనిచేస్తున్నారు" అని ప్రధాని మోదీ అన్నారు.గడచిన 10-12 ఏళ్లలో భారతదేశ మెట్రో నెట్‌వర్క్ విస్తరణ గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "2014లో 248 కి.మీ ఉన్న మెట్రో నెట్‌వర్క్ ప్రస్తుతం దాదాపు 1,200 కి.మీ మేర పెరిగింది. 2014లో మెట్రో సేవలు కేవలం 5 నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండేవి. కానీ నేడు దేశవ్యాప్తంగా 26 నగరాల్లో మెట్రో నడుస్తోంది. ఇప్పుడు ప్రతిరోజూ కోటి మందికి పైగా ప్రజలు మెట్రోల్లో ప్రయాణిస్తున్నారు" అని మోదీ పేర్కొన్నారు.మోదీ ప్రారంభించిన ఈ పుణె మెట్రో లైన్- 'పింక్ లైన్ మాన్, డిస్ట్రిక్ట్ కోర్ట్ మెట్రో స్టేషన్లను కలుపుతుంది. ఈ కారిడార్ హింజేవాడి ఐటీ హబ్, శివాజీనగర్ మధ్య మెట్రో కనెక్టివిటీని అందిస్తుంది. దీని వల్ల రోజూ వేలాది మందికి ప్రయాణం మరింత సులువు అవుతుంది.

ముందే వచ్చిన కాలుష్య సంక్షోభం

మొదటిపేజీ తరువాయి - 'వెరీ పూర్' కేటగిరీకి పడిపోయింది. దీపావళికి కొద్ది రోజుల ముందే ఈ పరిస్థితి నెలకొనడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భారత్‌లోని పంజాబ్, హర్యానాలతో పాటు పొరుగున ఉన్న పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో పెద్ద ఎత్తున జరుగుతున్న వ్యవసాయ వ్యర్థాల దహనమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన శాటిలైట్ డేటా ఈ వాస్తవాన్ని స్పష్టం చేస్తోంది. అక్టోబర్ 1 నుంచి 29 మధ్య పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఏకంగా 13,241 వ్యవసాయ వ్యర్థాల దహనాలను గుర్తించగా, అదే సమయంలో భారత పంజాబ్‌లో 3,158 దహనాలు నమోదయ్యాయి. వాయవ్య దిశ నుంచి వీస్తున్న గాలులు ఈ పొగను ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతానికి మోసుకొస్తున్నాయి. దీనికి తోడు, వాతావరణంలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, గాలి వేగం మందగించడం వంటి కారణాలతో కాలుష్య కారకాలు గాలిలోనే చిక్కుకుపోతున్నాయి. స్థానిక కాలుష్యానికి ఈ పొగ తోడవడంతో పరిస్థితి మరింత దిగజారింది.పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్' (జీఆర్ఏపీ) స్టేజ్-2ను అమలులోకి తెచ్చారు. దీని కింద, రోడ్లపై నీళ్లు చల్లడం, యాంటీ-స్మాగ్ గన్‌ల వినియోగం, నిర్మాణ కార్యకలాపాలపై కఠిన నిషా వంటి చర్యలు ముమ్మరం చేశారు. రాబోయే రోజుల్లో కూడా గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు దీపావళి పండుగ సందర్భంగా బాణసంచా కాల్చడం వల్ల కాలుష్యం మరింత ప్రమాదకర స్థాయికి చేరే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అన్ని అపోహలు పటాపంచలు

మొదటిపేజీ తరువాయి - భారత తొలి అంతరిక్ష ఆధారిత సౌర పరిశోధన కేంద్రం ఆదిత్య-ఎల్1 మరో చరిత్రాత్మక విజయాన్ని సాధించింది. సూర్యుడి నుంచి వెలువడే అత్యంత శక్తివంతమైన కరోనల్ మాస్ ఎజెక్షన్‌ల (సీఎంఈ)పై సరికొత్త వివరాలను వెలుగులోకి తెచ్చింది. అంతరిక్ష వాతావరణ అధ్యయనంలో ఈ పరిశోధన ఒక కీలక ముందడుగు అని, దీనివల్ల భూమిపై ఉపగ్రహాలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లకు సౌర తుపానుల నుంచి ఎదురయ్యే ముప్పును మరింత కచ్చితంగా అంచనా వేయవచ్చని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది.ఇప్పటివరకు సౌర జ్వాలలు అన్ని వైపులా ఒకే రీతిలో, సమానంగా విస్తరిస్తాయని శాస్త్రవేత్తలు భావించేవారు. అయితే, ఆదిత్య-ఎల్1 అందించిన డేటా ఈ అంచనాను తప్పని నిరూపించింది. ఈ భారీ సౌర విస్ఫోటనాలు అసమానంగా (ఫ్రంఎఎవిటీఅఫ్రిశ్రీఎ) విస్తరిస్తాయని తొలిసారిగా రుజువైంది. సీఎంఈల విస్తరణలోని ఈ తేడాలు, అవి భూమి వైపు ప్రయాణించే వేగాన్ని నేరుగా ప్రభావితం చేస్తాయని, అంతరిక్ష వాతావరణంలో అలజడులకు కారణమవుతాయని శాస్త్రవేత్తలు గుర్తించారు.బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (××ా) పరిశోధకులు ఈ అధ్యయనాన్ని పూర్తి చేశారు. ఇందుకోసం ఆదిత్య-ఎల్1లోని ప్రధాన పేలోడ్ అయిన విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ నుంచి వచ్చిన డేటాను, నాసాకు చెందిన సోలార్ డైనమిక్స్ అబ్జర్వేటరీ (ణఆా) సమాచారంతో అనుసంధానించారు. అనంతరం 3డీ మోడలింగ్ ద్వారా సీఎంఈ పూర్తి స్వరూపాన్ని, దాని కదలికలను పునర్నిర్మించారు.

'ఒకే వేదికపై ఎప్పుడూ నిరసనలంటే ఎలా?'

మొదటిపేజీ తరువాయి -

కాలపరిమితి ఉండాలని పేర్కొంది. రైతులు, జర్నలిస్టులు, ఇతర వర్గాల వారు కూడా తమ సమస్యలపై నిరసన తెలిపేందుకు అవకాశం ఉండాలని వ్యాఖ్యానించింది. దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కొనసాగుతున్న ఆందోళనల వల్ల వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వ్యాపార సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా మంగళవారం నాడు న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది.సీఈసీకి వ్యతిరేకంగా, ఓట్ చోరీ ఆరోపణలపై ప్రతిపక్షాలు చేపట్టిన నిరసన కారణంగా పండుగల సమయంలో వ్యాపారాలు నష్టపోతున్నాయని వ్యాపార సంఘాలు ఇటీవల కోర్టును ఆశ్రయించాయి. ఆందోళనలను నిలిపివేయాలని, పండుగల సీజన్‌లో నిరసనలపై ఆంక్షలు విధించాలని కోరాయి. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం, కేంద్ర ప్రభుత్వంతో ప

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

బుధవారం 04 - 11 - 2026

అనంతపురంలో బియ్యం ధరల

నియంత్రణకు పౌరసరఫరాల శాఖ నిర్ణయం

అనంతపురము తెలుగుకలం నవంబర్ 03 : రాష్ట్రంలో బియ్యం ధరలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన మరియు అందుబాటులో ఉండే ధరలకు అందించాలనే ఉద్దేశంతో పౌరసరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో అక్టోబర్ 27, 2026 నాడు బియ్యం మిల్లర్ల సంఘం ప్రతినిధులు, హోల్‌సేల్ మరియు రిటైల్ వ్యాపారులు, ప్రైవేట్ రైస్ మిల్లర్లతో పాటు సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మార్కెట్‌లో వివిధ రకాల బియ్యం ధరలను సమీక్షించి, ఒకే రకమైన బియ్యాన్ని వేర్వేరు బ్రాండ్ పేర్లతో విక్రయిస్తూ అధిక ధరలు వసూలు చేయకుండా నిరోధించేందుకు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా రిటైల్ విక్రయ ధరలను ఖరారు చేశారు.

ప్రభుత్వం నిర్ణయించిన వివిధ రకాల బియ్యం కిలో ధరల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

BPT-3291 (సొనా) బియ్యం కిలో రూ. 66/- **BPT**-5204 (సొనా) బియ్యం కిలో రూ. 66/- **KNM** బియ్యం కిలో రూ. 66/- **HMT** బియ్యం కిలో రూ. 76/- **RNR** బియ్యం కిలో రూ. 76/- జై శ్రీరామ్ బియ్యం కిలో రూ. 82/- **MTU** సాధారణ రకాలు బియ్యం కిలో రూ. 47/- సంబంధిత బియ్యం మిల్లర్లు మరియు వ్యాపారులు ఈ ధరలను అంగీకరించి, ప్యాకింగ్ చేసిన బియ్యం సంచులపై నిర్ణయించిన ధరలను గరిష్ట చిల్లర విక్రయ ధర **(MRP)** గా ముద్రించడానికి అంగీకరించారు. ఒకే రకమైన బియ్యాన్ని కేవలం బ్రాండ్ పేరు లేదా బ్రాండ్ విలువ ఆధారంగా నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు విక్రయించకూడదని స్పష్టం చేశారు. అనంతపురం జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ మరియు రిటైల్ వ్యాపారులు ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఎవరైనా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు గుర్తించినట్లయితే వారిపై సంబంధిత చట్టాలు మరియు నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కావున, జిల్లాలోని బియ్యం మిల్లర్లు, హోల్‌సేల్ మరియు రిటైల్ వ్యాపారులు నిర్ణయించిన ధరలకు అనుగుణంగా బియ్యాన్ని విక్రయిస్తూ వినియోగదారులకు సహకరించాలని కోరడమైనది. వినియోగదారులు బియ్యం కొనుగోలు చేసే సమయంలో బియ్యం రకం మరియు ధరను పరిశీలించాలని, నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలు వసూలు చేసినట్లయితే, టోల్ ఫ్రీ నంబరు: 8500292992 కు ఫోన్ చేసి పౌర సరఫరాల శాఖ అధికారుల దృష్టికి ఫిర్యాదు చేయాలని కోరడమైనది.

ఈకేవైసీ, మొబైల్ నంబర్

అనుసంధానం కాకున్నా రేషన్ ఇవ్వాల్సిందే

అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ స్పష్టత

అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : మొబైల్ నంబర్ అనుసంధానం కాలేదని లేదా కుటుంబ సభ్యుల ఈకేవైసీ (వఖ్‌జ) పెండింగ్‌లో ఉందనే నెపంతో అర్హులైన లబ్ధిదారులకు రేషన్ పంపిణీ నిలిపివేయరాదని అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు. కొంతమంది రేషన్ డీలర్లు ఈ కారణాలు చూపుతూ కార్డుదారులకు రేషన్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో పౌరసరఫరాల శాఖ స్పందించింది. మొబైల్ నంబర్ అనుసంధానం లేదా ఈకేవైసీ పూర్తికానంత మాత్రాన రేషన్ ఆపాలని పౌరసరఫరాల శాఖ నుంచి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఆధార్ నంబర్‌కు మొబైల్ నంబర్ అనుసంధానమై ఉండని లబ్ధిదారుల వివరాలను మాత్రమే సేకరించి, వాటిని ఇ-పోస్ **(e-POS)**, వీఆర్ఓ **(VRO)** మరియు తహశీల్దార్ లాగిన్ల ద్వారా అప్‌డేట్ చేయాలని మాత్రమే అధికారులను ఆదేశించినట్లు వివరించారు. కాబట్టి, అర్హత కలిగిన ఏ ఒక్క లబ్ధిదారుడికి రేషన్ పంపిణీ నిలిచిపోకూడదని, ప్రభుత్వం ఇచ్చే రేషన్‌ను నిబంధనల ప్రకారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందజేయాలని డీలర్లను ఆదేశించారు. ఒకవేళ ఏ డీలరైనా ఈకేవైసీ లేదా మొబైల్ నంబర్ అనుసంధానం సాకుగా చూపి రేషన్ ఇవ్వడానికి నిరాకరిస్తే, బాధితులు తక్షణమే జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 8500292992 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని జిల్లా యంత్రాంగం తెలియజేసింది.

కూటమి అభ్యర్థుల గెలుపే

లక్ష్యంగా చవ్వా గోపాల్ రెడ్డి ఎన్నికల ప్రచారం



యాడికి నవంబర్ 03 (తెలుగుకలం) : యాడికి మండల జడ్పీటీసీ కూటమి అభ్యర్థి వేలూరు రంగయ్యతో పాటు ఎంపీటీసీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ సీనియర్ నాయకుడు,అనంత పురం జిల్లా క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్ రెడ్డి మంగళవారం యాడికి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలోని హాస్పిటల్ కాలనీలో ఎంపిటిసి 5 అభ్యర్థి నంద్యాల ఆదిలక్ష్మి తో పాటు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి జడ్పీటీసీ అభ్యర్థి వేలూరు రంగయ్యతో పాటు కూటమి ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల రంగస్వామి, బట్ట అనిత,తిరంపురం నీలకంఠ,కూన వెంకటస్వామి,కుమార్ రావు,నంద్యాల రామాంజనేయులు,పెయింటర్ విజయ్, దస్తగిరి, బాలం శ్రీనివాసులు, మేకల నాగార్జున, కళ్లెముని నాగరాజు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగాపే ఆశ్రమంలో అన్నదానం



యాడికి నవంబర్ 03 (తెలుగుకలం) : యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో మూలం చెన్నప్ప జ్ఞాపకార్థం ఆయన భార్య గౌరమ్మ, కుమారుడు భాస్కర్, మనవడు చంద్ర అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయాన్ని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా తన తాతయ్యకు ఆశ్రయం కల్పించి, ఆదరించిన అగాపే ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తాతయ్య జ్ఞాపకార్థం ఆశ్రమంలోని వృద్ధులు, నిరాశ్రయులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రతిరోజూ ఫీవర్ సర్వే నిర్వహించాలి

యాడికి నవంబర్ 03 (తెలుగుకలం) : యాడికి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు పరమేశ్వర్,సాయి సుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే సమావేశంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఆశా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఫీవర్ సర్వే నిర్వహించాలని,గ్రామాల్లో జ్వరాలు ఎక్కువగా ఉంటే వైద్యాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. తాగునీటి పైపుల లీకేజీలను వెంటనే సరిచేయించాల ని, ప్రతి శుక్రవారం డ్రైడే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహ న కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో పీహెచ్ఎన్ శోభకుమారి,సూపర్‌వైజర్లు మేరీ, విజయకుమారి, ఏఎన్ ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు..

గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనం..!

48 వార్డుల్లో హోరాహోరీ పోరు..

కౌన్సిలర్ స్థానాల్లో ప్రధాన పార్టీల మధ్య ఆసక్తికర పోటీ

25వ వార్డులో రామ్ తేజ్ గౌడ్ ఏకగ్రీవం..

స్వతంత్ర అభ్యర్థిగా 36వ వార్డులో సిరిన్ ఫర్హాద్ గెలుపు



గుంతకల్లు నవంబర్ 03 తెలుగు కలం :- గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడటంతో పట్టణ రాజకీయాల్లో సందడి నెలకొంది. మొత్తం 48 వార్డులకు జరిగిన ఎన్నికల్లో వివిధ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా విజయాలు నమోదు చేశారు. పలు వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు గెలుపొందగా, వైసీపీ అభ్యర్థులు సైతం తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. స్వతంత్ర అభ్యర్థుల విజయాలు కూడా ఈ ఎన్నికల్లో ప్రత్యేకంగా నిలిచాయి.కసాపురం రోడ్డులోని సర్వేపల్లి రాధాకృష్ణన్ పురపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు నిర్వహించారు. అధికారులు వార్డుల వారీగా ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించారు. ప్రతి వార్డు ఫలితంతో అభ్యర్థులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది.

వార్డుల వారీగా విజేతల వివరాలు:

1. ప్రభాకర్ -- టీడీపీ -- 570 ఓట్లు, 2. రమాదేవి -- సీపీఐ -- 137 ఓట్లు, 3. గుండా జ్యోతి -- వైసీపీ -- 67 ఓట్లు, 4. మాండ్ల మహాలక్ష్మి - బీజేపీ -- 14 ఓట్లు, 5. రామాంజనమ్మ -- టీడీపీ -- 461 ఓట్లు, 6. స్టోర్ రమేష్ -- టీడీపీ, 7. సాంబశివ -- వైసీపీ -- 613 ఓట్లు, 8. మహదేవ్ -- వైసీపీ, 9. అరుణ -- వైసీపీ, 10. గాజుల సంధ్య -- స్వతంత్ర -- 58 ఓట్లు, 11. హరినాథ్ -- స్వతంత్ర -- 121 ఓట్లు, 12. గాజుల వెంకటేష్ -- టీడీపీ -- 209 ఓట్లు, 13. రంగమ్మ -- వైసీపీ -- 262 ఓట్లు, 14. మస్తాన్ -- వైసీపీ -- 152 ఓట్లు, 15. కోడెల జీవిత -- టీడీపీ -- 391 ఓట్లు, 16. రమేష్ గౌడ్ -- 248 ఓట్లు, 17. బి. విజయలక్ష్మి -- టీడీపీ -- 319 ఓట్లు, 18. యూనస్ -- స్వతంత్ర -- 140 ఓట్లు, 19. అంజినేయులు -- టీడీపీ -- 47 ఓట్లు, 20. నాగరత్న -- టీడీపీ -- 627 ఓట్లు, 21. లక్ష్మి -- స్వతంత్ర, 22. సాయి -- టీడీపీ, 23. పార్వతి -- టీడీపీ, 24. అంజలి -- టీడీపీ -- 381 ఓట్లు, 25. రామ్ తేజ్ గౌడ్ -- టీడీపీ -- ఏకగ్రీవం, 26. కృపాకర్ -- టీడీపీ -- 75 ఓట్లు, 27. నూర్ -- వైసీపీ,28. జమీలా బీ -- వైసీపీ -- 80 ఓట్లు, 29. చిట్టెమ్మ -- టీడీపీ -- 408 ఓట్లు, 30. హనుమంతు -- టీడీపీ -- 246 ఓట్లు, 31. నందీశ్వర -- టీడీపీ -- 877 ఓట్లు, 32. సుజాత -- టీడీపీ -- 751 ఓట్లు, 33. బట్నపాడు లక్ష్మి -- 109 ఓట్లు, 34. రేష్మ -- వైసీపీ -- 176 ఓట్లు, 35. బి. మానెమ్మ -- వైసీపీ -- 531 ఓట్లు, 36. సిరిన్ ఫర్హాద్ -- స్వతంత్ర -- 102 ఓట్లు, 37. రమిజా బేగం -- వైసీపీ,38. సహానాజ్ -- వైసీపీ, 39. పవన్ కుమార్ -- వైసీపీ, 40. ప్రభాకర్ -- టీడీపీ -- 440 ఓట్లు, 41. కృష్ణమూర్తి -- స్వతంత్ర 42. కె.ఎల్. సీనా -- టీడీపీ -- 507 ఓట్లు, 43. శరణ్య -- స్వతంత్ర 44. ఎం.ఎం. రహిమాన్ -- వైసీపీ -- 448 ఓట్లు, 45. రిజ్వాన -- టీడీపీ -- 121 ఓట్లు, 46. రామాంజనేయులు -- టీడీపీ -- 123 ఓట్లు, 47. నాగభూషణ -- టీడీపీ 48. జీవిత -- టీడీపీ -- 47 ఓట్లు వార్డుల ఫలితాలతో విజయం సాధించిన అభ్యర్థులు తమ అనుచరులతో ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా 25వ వార్డులో రామ్ తేజ్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికవగా, 36వ వార్డులో సిరిన్ ఫర్హాద్, 43వ వార్డులో శరణ్య స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించడం విశేషం.మరోవైపు మున్సిపల్ వైర్‌పర్సన్ అభ్యర్థులకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఆరు రౌండ్లకు గాను ఇంకా రెండు రౌండ్ల మిగిలి ఉండటంతో తుది ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.

గుత్తి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

5 వార్డుల ఓట్ల లెక్కింపు వివరాలు

గుత్తి (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : అనంతపురం జిల్లా గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని 5 వార్డుల ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయి తుది ఫలితాలు వెలువడ్డాయి. తీవ్ర ఉత్కంఠ నడుమ సాగిన ఈ స్థానిక పోరులో కూటమి అభ్యర్థులు స్పష్టమైన విజయాన్ని సాధించారు. మొత్తం 5 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ 2 వార్డులను, జనసేన పార్టీ 2 వార్డులను కైవసం చేసుకోగా, భారతీయ జనతా పార్టీ ఒక వార్డులో జయకేతనం ఎగురవేసింది. రెండో వార్డులో జనసేన పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధించారు. ఈ వార్డులో మొత్తం 1098 ఓట్లకు గాను 536 ఓట్లు పోల్ అయ్యాయి. ఓట్ల లెక్కింపులో జనసేన అభ్యర్థికి అత్యధికంగా 446 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి అయిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి 80 ఓట్లకు పరిమితమయ్యారు. స్వతంత్ర అభ్యర్థికి 4 ఓట్లు దక్కగా, నోటాకు 3 ఓట్లు పడ్డాయి. కాగా 3 ఓట్లు చెల్లకుండా పోయాయి (ఇన్వాలిడ్). నాలుగో వార్డులో సైతం జనసేన పార్టీ అభ్యర్థే పైచేయి సాధించారు. మొత్తం 1175 ఓట్లు ఉన్న ఈ వార్డ పరిధిలో 650 ఓట్లు పోలయ్యాయి. హోరాహోరీగా సాగిన పోరులో జనసేన అభ్యర్థి 326 ఓట్లు సాధించి విజయం సాధించగా, తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి 312 ఓట్లు వచ్చాయి. ఇక్కడ నోటాకు 3 ఓట్లు నమోదు కాగా, 9 ఓట్లు ఇన్వాలిడ్ అయ్యాయి. పదో వార్డును తెలుగుదేశం పార్టీ దక్కించుకుంది. 1368 మొత్తం ఓట్లకు గాను 869 ఓట్లు పోల్ అయిన ఈ వార్డులో టీడీపీ అభ్యర్థి 467 ఓట్లు సాధించి గెలుపొందారు. ఇండిపెండెంట్ అభ్యర్థి 394 ఓట్లు సాధించి గట్టి పోటీని ఇచ్చారు. ఈ వార్డులో నోటాకు 8 ఓట్లు రాగా, ఇ?వాలిడ్ ఓట్లు ఏవీ నమోదు కాలేదు. ఇరవై నాలుగో వార్డులో భారతీయ జనతా పార్టీ విజయాన్ని అందుకుంది. మొత్తం 1287 ఓట్లకు గాను 697 ఓట్లు పోలైన ఈ వార్డులో బీజేపీ అభ్యర్థి 489 ఓట్లు సాధించి స్పష్టమైన మెజార్టీతో విజయం సాధించారు. సీపీఐ(ఎం) అభ్యర్థికి 186 ఓట్లు రాగా, నోటాకు 15 ఓట్లు పడ్డాయి. 7 ఓట్లు ఇన్వాలిడ్ అయ్యాయి. ఇరవై ఆరో వార్డులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఏకపక్ష విజయం సాధించారు. 1243 మొత్తం ఓట్లు ఉన్న ఈ వార్డులో 644 ఓట్లు పోలయ్యాయి. ఇందులో టీడీపీ అభ్యర్థి 560 ఓట్లు సాధించి ప్రత్యర్థులపై విజయం సాధించగా, జనసేన అభ్యర్థికి 62 ఓట్లు దక్కాయి. నోటాకు 17 ఓట్లు పడగా, 7 ఓట్లు ఇన్వాలిడ్ అయ్యాయి.

కళ్యాణదుర్గం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ క్లీన్‌స్వీప్

చైర్మన్‌గా బుట్టా లక్ష్మీ దేవి విజయం



కళ్యాణదుర్గం (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. మొత్తం 32 వార్డులకు గాను తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని మున్సిపల్ పీఠాన్ని దక్కించుకుంది. చైర్మన్‌గా టీడీపీ అభ్యర్థి బుట్టా లక్ష్మీ దేవి విజయం సాధించారు. ఈ ఎన్నికలలో కూటమి అభ్యర్థుల హవా స్పష్టంగా కనిపించింది. మొత్తం 32 వార్డుల్లో తెలుగుదేశం పార్టీ ఏకంగా 25 వార్డులను తన ఖాతాలో వేసుకోగా, మిత్రపక్షాలైన జనసేన ఒక స్థానాన్ని, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం 4 వార్డులకే పరిమితమవ్వాల్సి వచ్చింది. కాగా, 12వ వార్డులో టీడీపీకి చెందిన అభ్యర్థి రేవతి ముందే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వివిధ వార్డుల్లో అభ్యర్థులు సాధించిన ఓట్లు, సాధించిన మెజార్టీల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

మొదటి వార్డులో టీడీపీ అభ్యర్థి కృష్ణమోహన్ 561 ఓట్లు సాధించి, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి (401 ఓట్లు) పై 160 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 2వ వార్డులో టీడీపీ అభ్యర్థి హెచ్. హనుమంతు (551 ఓట్లు) వైఎస్సార్‌సీపీ అభ్యర్థి (396 ఓట్లు) పై 155 ఓట్లతో గెలుపొందారు. 3వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిట్టి త్రివేణి (501 ఓట్లు) టీడీపీ అభ్యర్థి (421 ఓట్లు) పై 80 ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, 4వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తిమ్మప్ప (473 ఓట్లు) టీడీపీ అభ్యర్థి (387 ఓట్లు) పై 86 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 5వ వార్డులో టీడీపీ అభ్యర్థి వెంకటలక్ష్మి 815 ఓట్లు సాధించి, ప్రత్యర్థిపై 566 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. 6వ వార్డులో టీడీపీ అభ్యర్థి శైలజ 413 ఓట్ల మెజార్టీ (730 ఓట్లు), 7వ వార్డులో టీడీపీ అభ్యర్థి పెంటల వాణి 358 ఓట్ల మెజార్టీ (542 ఓట్లు), 8వ వార్డులో టీడీపీ అభ్యర్థి సునీత 447 ఓట్ల మెజార్టీ (673 ఓట్లు) సాధించి ఘన విజయం సాధించారు. 9వ వార్డులో జనసేన పార్టీ అభ్యర్థి వనం అమృత 475 ఓట్లు పొంది, వైఎస్సార్‌సీపీ పై 238 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 10వ వార్డులో టీడీపీ అభ్యర్థి వెంకటరమణ (330 ఓట్లు) 199 ఓట్లతో, 11వ వార్డులో టీడీపీ అభ్యర్థి తిమ్మ రాజమ్మ (593 ఓట్లు) 441 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 13వ వార్డులో టీడీపీ అభ్యర్థి గోళ్ళ హసీనా బేగం 639 ఓట్లతో, 512 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందగా, 14వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎరుకుల అజయ్ (346 ఓట్లు) టీడీపీపై 55 ఓట్ల మెజార్టీ సాధించారు. 15వ వార్డులో టీడీపీ అభ్యర్థి నాగమణి 159 ఓట్ల మెజార్టీ (505 ఓట్లు) తోనూ, 16వ వార్డులో టీడీపీ అభ్యర్థి సూగేపల్లి త్రివేణి 232 ఓట్ల మెజార్టీ (551 ఓట్లు) తోనూ విజయం సాధించారు. 17వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దీప్తి 403 ఓట్లు సాధించి, టీడీపీ అభ్యర్థి (341 ఓట్లు) పై 62 ఓట్ల మెజార్టీతో గెలిచారు. 18వ వార్డులో బీజేపీ అభ్యర్థి అరుణా యాదవ్ 467 ఓట్లు సాధించి, వైఎస్సార్‌సీపీ పై 201 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 19వ వార్డులో టీడీపీ అభ్యర్థి గుండ్ల పావని 33 ఓట్ల స్వల్ప మెజార్టీ (427 ఓట్లు) తో గెలవగా, 20వ వార్డులో టీడీపీ అభ్యర్థి అచ్చువల్లి అనిత 576 ఓట్ల మెజార్టీ (720 ఓట్లు) సాధించారు. మిగిలిన వార్డుల్లోనూ టీడీపీ హవా కొనసాగింది. 21వ వార్డులో పూజారి ఆశ 178 ఓట్ల మెజార్టీ (552 ఓట్లు), 22వ వార్డులో శ్వేత 533 ఓట్ల మెజార్టీ (631 ఓట్లు), 23వ వార్డులో బాల సోము 687 ఓట్ల మెజార్టీ (797 ఓట్లు), 24వ వార్డులో పార్వతమ్మ 564 ఓట్ల మెజార్టీ (663 ఓట్లు) తో గెలిచారు. 25వ వార్డులో పూజారి మహేష్ 803 ఓట్లు సాధించి, 713 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించగా, 26వ వార్డులో ఇమ్రాన్ 646 ఓట్ల మెజార్టీ (732 ఓట్లు), 27వ వార్డులో పూల వెంకటేశులు 505 ఓట్ల మెజార్టీ (642 ఓట్లు) సాధించారు. అలాగే 28వ వార్డులో చింతపండు కార్తీక్ 607 ఓట్ల మెజార్టీ (715 ఓట్లు), 29వ వార్డులో అన్వర్ భాష 535 ఓట్ల మెజార్టీ (611 ఓట్లు), 30వ వార్డులో బేరీల ఈశ్వరమ్మ 139 ఓట్ల మెజార్టీ (540 ఓట్లు), 31వ వార్డులో ఇటుకల రామాంజనేయులు 644 ఓట్ల మెజార్టీ (701 ఓట్లు) మరియు 32వ వార్డులో బిర్ర గోవిందప్ప 320 ఓట్ల మెజార్టీ (544 ఓట్లు) సాధించి విజయం సాధించారు. కళ్యాణదుర్గం మున్సిపల్ ఫలితాలలో తెలుగుదేశం పార్టీ సాధించిన ఈ ఘన విజయంపై స్థానిక నాయకులు, శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిలిండర్ గుర్తుకు జైకొట్టిన

36వ వార్డు.. సిరిన్ ఫర్హాద్ విజయకేతనం....!

36వ వార్డులో సిలిండర్ గుర్తుకు జైకొట్టిన ఓటర్లు.. 162 ఓట్ల తేడాతో సిరిన్ ఫర్హాద్ విజయం

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వార్డు రూపురేఖలు మారుస్తా.. అభివృద్ధికి పెద్దమీట వేస్తా



గుంతకల్లు నవంబర్ 03 తెలుగు కలం :- మున్సిపల్ ఎన్నికల సమరంలో 36వ వార్డు ఓటర్లు విలక్షణమైన తీర్పునిచ్చారు. రాజకీయ పార్టీల అభ్యర్థుల మధ్య స్వతంత్రంగా బరిలోకి దిగిన సిరిన్ ఫర్హాద్‌కు ప్రజలు పట్టం కట్టారు. సిలిండర్ ఎన్నికల గుర్తుపై పోటీ చేసిన ఆమె 162 ఓట్ల ఆధిక్యంతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి కౌన్సిలర్ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ విజయంతో వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు.గెలుపు అనంతరం ఆమె మాట్లాడుతూ....ప్రజలు తనపై ఉంచిన విశ్వాసం ఎంతో విలువైనదని, ఆ నమ్మకానికి తగినట్లుగా పనిచేయడమే తన బాధ్యతని అన్నారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం పోరాడుతానని తెలిపారు.ముఖ్యంగా డ్రైనేజీ కాలువల సమస్య, రహదారుల దుస్థితి, తాగునీటి ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైన అభివృద్ధి పనుల కోసం అధికారులతో సంప్రదింపులు జరుపుతానన్నారు. ఎన్నికల సమయంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, వార్డు అభివృద్ధిలో ఎలాంటి వివక్షకు తావులేకుండా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె భర్త అచ్చుకట్ల మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రజలు అందించిన విజయాన్ని బాధ్యతగా స్వీకరిస్తామని, 36వ వార్డు అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభంజనం

21,172 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించిన పురిడి మంజునాథ్

హిందూపురం (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపాలిటీలో తెలుగుదేశం పార్టీ కూటమి ఘనవిజయం సాధించింది. మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం జరిగిన హోరాహోరీ పోరులో టీడీపీ కూటమి అభ్యర్థి పురిడి మంజునాథ్ తన సమీప ప్రత్యర్థిపై అనూహ్య ఆధిక్యతను ప్రదర్శించి భారీ విజయాన్ని నమోదు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతీ రౌండ్ లోనూ స్పష్టమైన ఆధిపత్యాన్ని కొనసాగించిన మంజునాథ్, మొత్తం 9 రౌండ్ల లెక్కింపు పూర్తయ్యే సరికి ఏకంగా 21,172 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. స్థానిక శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ నాయకత్వంలో కూటమి శ్రేణులు సమష్టిగా సాగించిన ప్రచారం, పట్టణాభివృద్ధిపై ఇచ్చిన హామీలు ఈ విజయానికి ప్రధాన కారణమని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రారంభ రౌండ్ నుంచే కనబరిచిన జోరు చివరి 9వ రౌండ్ వరకు కొనసాగడం విశేషం. మంజునాథ్ సాధించిన ఈ బంపర్ మెజార్టీతో టీడీపీ కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. ఎన్నికల ఫలితాలు వెలువడగానే హిందూపురం పట్టణంలో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, తీపి పదార్థాలు పంచుకుంటూ జై బాలయ్య, జై తెలుగుదేశం నినాదాలతో పట్టణాన్ని హోరెత్తించారు. తనపై నమ్మకం ఉంచి ఇంతటి భారీ విజయాన్ని అందించిన హిందూపురం ప్రజలకు, నియోజకవర్గ ఎమ్మెల్యే బాలకృష్ణకు, పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా నూతన మున్సిపల్ చైర్మన్ పురిడి మంజునాథ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారమే తన మొదటి ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

బుధవారం 04 - 11 - 2026

బండ్లపల్లిలో జోరందుకున్న టీడీపీ ఎన్నికల ప్రచారం

ఎమ్పీటీసీ అభ్యర్థి చీమల ఈశ్వరమ్మకు మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం

నార్వల (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : నార్వల మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచార హోరు తీవ్రరూపం దాల్చింది. గ్రామంలో ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చీమల ఈశ్వరమ్మకు మద్దతుగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ నేతృత్వంలో జోరుగా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, పార్టీ ప్రతినిధులతో కలసి గ్రామంలో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలను నేరుగా కలిశారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామంలో ఇప్పటికే చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించిన వారు, రాబోయే రోజుల్లో బండ్లపల్లిలో మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడమే ధ్యేయంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు సైతం ఎంపీటీసీ అభ్యర్థి చీమల ఈశ్వరమ్మ గెలుపు ఆవశ్యకతను గ్రామస్థులకు



వివరిస్తూ, గ్రామాభివృద్ధి ముందుకు సాగాలంటే టీడీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ



నాయకులు, కార్యకర్తలు శివారెడ్డి, మధుసూదన్ రెడ్డి, దినేస్ కుమార్ రెడ్డి, రాజారెడ్డి, అరవింద్ గౌడ్, రఘురాములు, జి. రామకృష్ణారెడ్డి, పిట్టు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో టీడీపీ విజయభేరి.. గాజుల వెంకటేష్ ఘన విజయం....!

ఓటర్ల తీర్పుతో ప్రత్యర్థిపై భారీ ఆధిక్యం..

207 ఓట్ల మెజారిటీతో పసుపు జెండా రెపరెపలు

ప్రజల ఆదరణే విజయానికి బాట..

ప్రచారంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటానన్న వెంకటేష్

గుంతకల్లు నవంబర్ 03 తెలుగు కలం :- గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల్లో 12వ వార్డులో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గాజుల వెంకటేష్ ఘన విజయం సాధించారు. ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని, వార్డు అభివృద్ధికి కృషి చేస్తానంటూ ఓటర్లను అభ్యర్థించిన ఆయనకు ప్రజలు పట్టం కట్టారు. ప్రత్యర్థి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 207 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు.ఎన్నికల ఓట్ల లెక్కింపులో టీడీపీ అభ్యర్థి గాజుల



వెంకటేష్‌కు 602 ఓట్లు రాగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 402 ఓట్లు లభించాయి. దీంతో వెంకటేష్ 207 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల ఫలితాలు వెల్లడించాయి.ఎన్నికల ప్రచార సమయంలో 12వ వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని గాజుల వెంకటేష్ ప్రజలకు హామీ ఇచ్చారు. వార్డు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఆయనతో పాటు టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి యశోదమ్మ కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ప్రచారంలో ప్రజల నుంచి లభించిన స్పందన ఓట్ల రూపంలో విజయంగా మారడంతో టీడీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. 12వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని గాజుల వెంకటేష్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

నార్వల మండల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రధాన ధ్యేయం

నార్వల (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : నార్వల మండలంలో సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ముందుకెళ్తోందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్వల సత్యనారాయణరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నార్వల మండల కేంద్రంలోని తన నివాసంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ అభ్యర్థి బూసుపల్లి శివానంద రెడ్డి, ఎంపీటీసీ అభ్యర్థి నార్వల స్వాతిలతలతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో నార్వల మండల పరిధిలో పలు కీలక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా చేపట్టామని సత్యనారాయణరెడ్డి గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో గడిచిన రెండున్నరేళ్లుగా మండలంలో ఆశించిన స్థాయిలో ప్రగతి కనిపించడం లేదని తీవ్ర విమర్శలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల కొరతను తీర్చడం, ప్రధానంగా తాగునీరు, రహదారులు, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప పాలకులు తక్షణ ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన



అవసరం ఉందన్న ఆయన, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. యువతలో ఉన్న నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడితేనే గ్రామాలు, సమాజం వేగంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ అభ్యర్థి బూసుపల్లి శివానందరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామీణ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా ఆశీర్వాదంతో విజయం సాధిస్తే మండల రూపురేఖలు మారుస్తానన్నారు. ఎంపీటీసీ అభ్యర్థి నార్వల స్వాతిలత మాట్లాడుతూ, మహిళలు, పేద కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆదరించాలని ఈ సందర్భంగా పార్టీ నాయకులు పిలుపునిచ్చారు.

ఉత్కంఠభరిత పోరులో కదిరి మున్సిపల్ పీఠం టీడీపీ కైవసం

ఛైర్ పర్సన్‌గా షేక్ అర్షియా భాను ఘన విజయం

కదిరి (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : కదిరి మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సత్తా చాటింది. తీవ్ర ఉత్కంఠ నడుమ సాగిన ఈ పోరులో టీడీపీ మున్సిపల్ ఛైర్ పర్సన్ అభ్యర్థి షేక్ అర్షియా భాను ఘన విజయాన్ని సాధించి కదిరి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ప్రారంభం నుంచి చివరి వరకు రౌండ్ రౌండ్‌కూ అభ్యర్థులు, రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేపిన ఈ



కౌంటింగ్ ప్రక్రియ ముగిసేసరికి టీడీపీ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుని విజయాన్ని సొంతం చేసుకుంది. కౌంటింగ్ కేంద్రంలో హోరాహోరీగా సాగిన ఫలితాల లెక్కింపు ప్రక్రియలో షేక్ అర్షియా భాను తన సమీప ప్రత్యర్థిపై 905 ఓట్ల స్పష్టమైన మెజార్టీ సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతి కుమార్ అధికారికంగా వెల్లడించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం మారుతూ రావడంతో కౌంటింగ్ కేంద్రం వద్ద ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలలో తీవ్ర టెన్షన్ వాతావరణం నెలకొంది. అంతిమంగా ఫలితం టీడీపీ వైపే మొగ్గడంతో పార్టీ శ్రేణులు తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. కదిరి పట్టణాభివృద్ధే లక్ష్యంగా ప్రజలు ఇచ్చిన ఈ తీర్పుపై టీడీపీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. హోరాహోరీ విజయం అనంతరం ఎన్నికల అధికారి నుంచి ధృవీకరణ పత్రం అందుకున్న సందర్భంగా టీడీపీ మద్దతుదారులు, నాయకులు భారీ ఎత్తున విజయోత్సవ వేడుకలు నిర్వహించారు.

ధర్మవరం మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్న కూటమి... ఘన విజయం సాధించిన పరసే సుధాకర్

ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ప్రభంజనం సృష్టించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ ఎన్నికల్లో కూటమి చైర్మన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన పరసే సుధాకర్ తన సమీప ప్రత్యర్థి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసిపి) చైర్మన్ అభ్యర్థి కాచర్ల ఆంజనేయులుపై అఖండ విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన పోరులో ప్రత్యర్థిపై ఏకంగా 21,184 ఓట్ల భారీ మెజారిటీతో పరసే సుధాకర్ ఘన విజయాన్ని నమోదు చేసుకోవడం విశేషం.



ఎన్నికల ఫలితాలు వెలువడిన తరుణంలో ధర్మవరం పట్టణంలో కూటమి శ్రేణులు, నాయకులు సంబరాలు అంబరాన్ని తాకేలా నిర్వహించారు. స్థానిక ప్రజలు మరియు కూటమి కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయోత్సవాల్లో పాల్గొని బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ ఎన్నికల్లో లభించిన ఘన విజయం ధర్మవరంలో కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు అందించిన ఘన నిదర్శనమని కూటమి నేతలు అభిప్రాయపడ్డారు. భారీ మెజారిటీతో గెలుపొందిన నూతన మున్సిపల్ చైర్మన్ పరసే సుధాకర్ ధర్మవరం పట్టణాభివృద్ధే తన ప్రథమ ధ్యేయమని పేర్కొంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ధర్మవరం టీడీపీలోకి 43వ వార్డు స్వతంత్ర అభ్యర్థి చింతా లక్ష్మీనారాయణ చేరిక



ధర్మవరం (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : ధర్మవరం రాజకీయ వర్గాలలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పట్టణంలోని 43వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన చింతా లక్ష్మీనారాయణ తెలుగుదేశం పార్టీలో అధికారికంగా చేరారు. ?ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సంధా రాఘవ సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చింతా లక్ష్మీనారాయణను పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తూ నాయకులు మరియు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కుటుంబంలోకి ఆయన రాకతో స్థానికంగా పార్టీ బలం మరింత ఇనుమడించనుందని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

ఆసియా టాప్ 100 వర్సిటీల్లో ఐఐఎన్‌సీ బెంగళూరు, 5 ఐఐటీలు- కానీ పడిపోయిన ర్యాంకులు!

క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో బెంగళూరు ఐఐఎన్‌సీతో పాటుగా మరో ఐదు ఐఐటీలు టాప్- 100 లో నిలిచాయి. అయితే గతేడాదితో పోలిస్తే ర్యాంకులు పడిపోయాయి.



అంతర్జాతీయ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో భారత ఉన్నత విద్యా సంస్థలు మరోసారి సత్తా చాటాయి. లండన్‌కు చెందిన ప్రసిద్ధ సంస్థ క్వాక్వారెల్లీ సైమండ్స్ మంగళవారం రోజు ఆసియాలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాను విడుదల చేసింది. ఇందులో టాప్- 100లో భారతదేశం నుంచి ఐఐఎన్‌సీ బెంగళూరుతో పాటు ఐదు ఐఐటీలు మరోసారి చోటు దక్కించుకున్నాయి. అయితే వీటిల్లో ఏ ఒక్కటీ గతేడాదితో పోలిస్తే తమ స్థానాల్ని మెరుగుపర్చుకోలేకపోయాయి. అంటే గతేడాది కంటే దిగువ స్థానాలకు పడిపోయాయి. ఇందులో భారత్ నుంచి భారత్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన విద్యా సంస్థగా ఐఐటీ దిల్లీ నిలిచింది. ఆసియా మొత్తంలో ఇది 66వ స్థానంలో నిలిచింది. గతేడాది 59 వ ర్యాంకులో ఉండగా ఈసారి 7 స్థానాలు దిగజారింది. అయితే ఈసారి ర్యాంకింగ్స్‌లో భారతీయ విశ్వవిద్యాలయాల ప్రాతినిధ్యం పెరిగింది. మొత్తంగా ఈసారి 325 భారతీయ యూనివర్సిటీలో జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇందులో 34 సంస్థలు తొలిసారి క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్స్‌లోకి ప్రవేశించాయి. దీంతో ర్యాంకింగ్స్‌లో అత్యధిక విశ్వవిద్యాలయాల ప్రాతినిధ్యం కలిగిన రెండో దేశంగా భారత్ నిలిచింది. చైనా తొలి స్థానంలో ఉంది. టాప్- 200 లో కూడా భారతీయ వర్సిటీల సంఖ్య గతంతో పోలిస్తే పెరిగింది. కిందటేడాది టాప్ 200 జాబితాలో 20 విశ్వవిద్యాలయాలు ఈ జాబితాలో నిలవగా, ఈసారి ఆ సంఖ్య 21కి పెరిగింది. 2018లో టాప్-200 వర్సిటీల లిస్టులో భారత విద్యా సంస్థలు 17 మాత్రమే ఉన్నాయి. అక్కడి నుంచి భారత్ క్రమంగా తన సంఖ్యను పెంచుకుంటూ వస్తోంది.

ర్యాంకుల్ని కోల్పోయిన భారత్‌లోని 6 ప్రముఖ విద్యా సంస్థలు

ఈ జాబితాలో భారత్‌లోని అన్ని ప్రముఖ విద్యా సంస్థలు ఈసారి ర్యాంకింగ్స్‌లో వెనుకబడ్డాయి. ఐఐటీ దిల్లీ 7 స్థానాల్ని కోల్పోగా, ఇతర ఐఐటీలు, ప్రముఖ విద్యా సంస్థలు కూడా ఇదే బాటలో పయనించాయి.

ఎన్నికల ఏర్పాట్లపై అధికారుల పరిశీలన



యాడికి నవంబర్ 03 (తెలుగుకలం) : యాడికి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సీఐ శ్రీనివాసులు, పంచాయతీ ఈఓ గీత బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మేస్త్రి రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా రేష్మ ఫర్వీన్ ఘన విజయం

భారీ మెజార్టీతో కైవసం చేసుకున్న టీడీపీ



తాడిపత్రి (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : అనంతపురం జిల్లాలోని కీలకమైన తాడిపత్రి మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కైవసం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో టీడీపీ అభ్యర్థి రేష్మ ఫర్వీన్ 24,861 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకున్నారు. పోలైన ఓట్ల లెక్కింపు వివరాలను పరిశీలిస్తే, విజేత రేష్మ ఫర్వీన్‌కు అత్యధికంగా 41,261 ఓట్లు నమోదయ్యాయి. ఆమె ప్రధాన సమీప ప్రత్యర్థి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అభ్యర్థి ఫయాజ్ బాషా 16,400 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ అన్వర్ కేవలం 659 ఓట్లకు పరిమితమయ్యారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు కాకుండా నోటా (నన్ ఆఫ్ ది అబో)కు 492 ఓట్లు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ వెల్లడించారు. అలాగే పరిగణనలోకి తీసుకోలేని విధంగా చెల్లకుండా పోయిన ఓట్ల సంఖ్య 984గా నమోదు అయినట్లు ఆయన వివరించారు. ఈ భారీ విజయంతో తాడిపత్రి పురపాలక సంఘంలో టీడీపీ శ్రేణులు తీవ్ర హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ సంబరాలు ప్రారంభించాయి.

గుంతకల్లు మున్సిపల్ పీఠం టీడీపీ వశం

6,557 ఓట్ల మెజార్టీతో యశోద ఘనవిజయం



గుంతకల్లు (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల పోరులో టీడీపీ తరఫున రేసులో నిలిచిన అభ్యర్థి రామగోని యశోద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అభ్యర్థి ఎన్. వెంకటలక్ష్మిపై 6,557 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తి చేసుకున్న అనంతరం అసిస్టెంట్ ఎన్నికల అధికారి లక్ష్మీదేవి అధికారిక ఫలితాలను వెల్లడించారు. ఈ ఎన్నికల్లో విజయకేతనం ఎగరవేసిన టీడీపీ అభ్యర్థి యశోదకు మొత్తం 31,127 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి వెంకటలక్ష్మి 29,570 ఓట్లు సాధించారు. రెండు పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, 6,557 ఓట్ల ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ యశోద గుంతకల్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పీఠాన్ని సునాయాసంగా సొంతం చేసుకున్నారు. విజయం ఖాయం కావడంతో టీడీపీ నాయకులు, శ్రేణులు, కూటమి మద్దతుదారులు మున్సిపల్ పరిధిలో పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. అభివృద్ధి దిశగా అడుగులు వేస్తూ మున్సిపాలిటీ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ఛైర్‌పర్సన్ యశోద స్పష్టం చేశారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో

అనంతపురం జేఎన్టీయూకు 4 రోజులు సెలవులు ప్రకటన



అనంతపురం (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : స్థానిక సంస్థల పరిధిలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు గానూ అనంతపురం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూఏ) కళాశాలకు నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో నవంబర్ 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు కళాశాలకు సెలవులు అమల్లో ఉంటాయని వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల నిర్వహణలో భాగంగా కళాశాల ప్రాంగణంలో పోలింగ్ ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ, ఓట్ల లెక్కింపు కేంద్రాల నిర్వహణతో పాటు స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ క్లిష్టమైన ఏర్పాట్ల దృష్ట్యా విద్యార్థులు, అధ్యాపకుల సాధారణ తరగతులకు భంగం కలగకుండా ఈ తాత్కాలిక సెలవుల నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జిల్లా ఎన్నికల అధికారుల నుంచి వచ్చిన ప్రత్యక్ష ఆదేశాలు మరియు సూచనలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. దుర్గా ప్రసాద్ ఒక అధికారిక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. నవంబర్ 4 నుండి 7 వరకు కళాశాల ప్రాంగణం పూర్తిస్థాయిలో ఎన్నికల యంత్రాంగం మరియు భద్రతా బలగాల పర్యవేక్షణలో ఉండనుండటంతో, విద్యార్థులందరూ ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. ఎన్నికల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయిన అనంతరం యధావిధిగా కళాశాల పునఃప్రారంభం కానుంది.

పుట్టపర్తి మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి ప్రభంజనం

1,573 ఓట్ల మెజారిటీతో జనసేన అభ్యర్థి మేకల ఈశ్వర్ ఘనవిజయం



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో అధికార తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కూటమి ప్రభంజనం సృష్టించింది. శ్రీ సత్యసాయి జిల్లాలోని కీలకమైన పుట్టపర్తి మున్సిపాలిటీ పీఠాన్ని కూటమి తిరుగులేని మెజారిటీతో కైవసం చేసుకుంది. కూటమి మద్దతుతో బరిలోకి దిగిన జనసేన పార్టీ ఛైర్మన్ అభ్యర్థి మేకల ఈశ్వర్ తన సమీప వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వనం అవినాష్‌పై 1,573 ఓట్ల భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించి పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. మొత్తం 28 వార్డులు ఉన్న పుట్టపర్తి మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఏకంగా 23 వార్డుల్లో విజయం సాధించి మున్సిపాలిటీపై తమ పట్టును బలంగా నిరూపించుకున్నారు. ప్రత్యర్థి వైఎస్సార్సీపీ కేవలం 5 వార్డులకే పరిమితమైంది. ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచే జనసేన అభ్యర్థి ఈశ్వర్ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరుస్తూ వచ్చారు. కౌంటింగ్ పూర్తయ్యే సరికి ప్రత్యర్థిపై తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించి విజయాన్ని ఖాయం చేసుకున్నారు. ఈ ఘనవిజయంతో పుట్టపర్తిలోని కూటమి నేతలు, జనసేన కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. స్థానిక నాయకులు మేకల ఈశ్వర్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించి బాణసంచా కాల్చుతూ తమ సంతోషాన్ని పంచుకున్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోలింగ్ నేపథ్యంలో

శ్రీ సత్యసాయి జిల్లాలోని బ్యాంకులకు నవంబర్ 5న సెలవు ప్రకటన



పుట్టపర్తి (తెలుగు కలం) (నవంబర్ 03) : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నందున నవంబర్ 5వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్ ఐఏఎస్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ పక్కాగా జరిగేందుకు, సిబ్బంది విధులకు భంగం కలగకుండా ఉండటానికి అలాగే పౌరులందరూ తమ ఓటు హక్కును వేగంగా ఉపయోగించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకోబడింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రజలను కోరారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ రోజున బ్యాంకుల కార్యకలాపాలు నిలిచిపోతాయని, ఖాతాదారులు మరియు ప్రజలు తమ బ్యాంకింగ్ వ్యవహారాలను ముందుగానే సమన్వయం చేసుకోవాలని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది.

రాప్తాడు ఘటన ఉన్మాదికి శస్త్ర చికిత్స కుడికాలు మోకాలు వరకు తొలగింపు

రాప్తాడు ఘటన ఉన్మాది హేమంత్ కుడి కాలును వైద్యులు తొలగించారు. మోకాలి పైవరకు తొలగించినట్లు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి తెలిపారు. అనంతపురం జిల్లా రాప్తాడు ఘటన ఉన్మాది హేమంత్ కుడి కాలును వైద్యులు తొలగించారు. మోకాలి పైవరకు తొలగించినట్లు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి తెలిపారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించినట్లు చెప్పారు. ఎడమ కాలికి సంబంధించిన రక్తనాళాలు దెబ్బతినడంతో ఆ కాలికి కూడా సర్జరీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నిందితుడిని ఆపరేషన్ థియేటర్ నుంచి ఏఎంసీకి తరలించి చికిత్స కొనసాగిస్తున్నామన్నారు. హేమంత్ ఆరోగ్యం నిలకడగా ఉందని మల్లీశ్వరి చెప్పారు.కుళ్లిపోయిన కాలు: పదోతరగతి విద్యార్థిని గోపికపై రంపంతో దాడిచేసిన ఉన్మాది హేమంత్‌పై పోలీసుల బృందం కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఆత్మకూరు అడవిలో అతడిని పట్టుకునే క్రమంలో సీఐ వెంకటేశ్‌పై నిందితుడు దాడికి యత్నించడంతో పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. అయినా ఎదురుదాడి చేయడంతో హేమంత్ కాళ్లపై కాల్చారు. తీవ్రంగా



గాయపడిన నిందితుడికి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. అతడి కుడి కాలుకు రక్తప్రసరణ జరగకపోవడంతో కుళ్లిపోయిందని దీంతో తొలగించినట్లు వైద్యులు తెలిపారు. కోలుకుంటున్న గోపిక: బెంగళూరు మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపిక ఆరోగ్యం క్రమంగా మెరుగవుతోందని వైద్యఆరోగ్య శాఖ వెల్లడించింది. రక్తపోటు అదుపులోకి వచ్చిందని, మూత్ర విసర్జన వ్యవస్థ మెరుగుపడిందని తెలిపింది. మూత్రపిండాల పనితీరు సాధారణ స్థాయిలో ఉన్నట్లు సోమవారం వైద్యులు వెల్లడించిట్లు పేర్కొంది. బెంగళూరులో గోపికకు చికిత్స అందిస్తున్న వైద్యులు మయూర్ శెట్టి, లాల్‌చంద్, శిజ్జు, కౌశిక్, రవికిరణ్‌లతో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. వైద్యుల కృషిని అభినందించారు. ఘటన జరిగాక బాలికకు తక్షణ చికిత్స అందించడంలో వేగంగా స్పందించిన అనంతపురం సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ మల్లీశ్వరి తదితరులను మంత్రి అభినందించారు. విధుల నిర్వహణలో వారు చూపిన చొరవను గుర్తిస్తూ డీఎంఈ ఎ.విష్ణువర్ధన్ ప్రశంస లేఖలు పంపించారు.లక్ష్మికి శస్త్ర చికిత్స: ఉన్మాది చేతిలో గాయపడి అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో విద్యార్థిని లక్ష్మికి సోమవారం ఆర్థోవిభాగం అసోసియేట్ ప్రొఫెసర్ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. దాడిలో లక్ష్మి కుడికాలి పాదానికి లోతైన గాయమైంది. వేళ్ల కదలికలకు సంబంధించి మూడు కండరాలు తెగిపోయాయి. ఔటనవేలు ఎముక స్థానభ్రంశం (డిస్‌లోకేషన్) అయింది. తెగిపోయిన కండరాలకు శస్త్రచికిత్స చేసి, ఔటనవేలిని సరిచేసి కట్టుకట్టారు.

హైదరాబాద్ శివార్లలో అక్రమ బోర్లను టార్గెట్ చేసిన హైడ్రా

అక్రమ బోర్లపై హైడ్రా ప్రత్యేక దృష్టి

సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో 7 బోర్లు, 6 వాటర్ సంపుల ధ్వంసం

అనుమతులు లేని భూగర్భ జలాల వాణిజ్య వినియోగంపై ఉక్కుపాదం

ట్యాంకర్ల వేగానికి చెక్ పడటంతో హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



హైదరాబాద్, దాని శివారు ప్రాంతాల్లో అక్రమంగా భూగర్భ జలాలను తోడేస్తూ సాగిస్తున్న నీటి వ్యాపారంపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేసి, నీటిని ట్యాంకర్ల ద్వారా అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం భారీ ఆపరేషన్ చేపట్టింది.ఈ ఆపరేషన్‌లో భాగంగా తెల్లాపూర్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 7 అక్రమ బోర్‌వెల్‌లను పైపులతో సహా తొలగించి, వాటిని పూర్తిగా పూడ్చివేసింది. అలాగే, నీటి నిల్వ కోసం నిర్మించిన 6 భారీ వాటర్ సంపులను కూడా అధికారులు ధ్వంసం చేశారు. నీటి రవాణాకు ఉపయోగిస్తున్న ట్యాంకర్లను సీజ్ చేసి, సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేశారు.భూగర్భ జలాలు అడుగంటిపోకుండా కాపాడటంతో పాటు, స్థానిక ప్రజలకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గత కొంతకాలంగా నీటి ట్యాంకర్లు అతివేగంగా, నిర్లక్ష్యంగా ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, తమ ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని పలు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల వాసులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో హైడ్రా ఈ చర్యలకు ఉపక్రమించింది.హైడ్రా తీసుకుంటున్న చర్యలతో తమకు ప్రాణభయం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెరువులు, కుంటల సమీపంలో జరుగుతున్న అక్రమ నీటి దందాను పూర్తిగా అరికట్టాలని వారు కోరుతున్నారు. అనుమతులు లేని బోర్లపై నిఘా కొనసాగిస్తామని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

"మురసు" తుపాను ప్రభావం ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు, విద్యుత్ సరఫరాకు అంతరాయం

'మురసు' తీవ్ర తుపాను ఒంగోలు సమీపంలో తీరం దాటింది. ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ నిరంతర పర్యవేక్షిస్తోంది. తుపాను సమస్యలను మనమిత్ర వాట్సాప్‌కు మెసేజ్ చేయాలని సూచించింది.అర్నబ్ తుపాను విధ్వంసానికి వారం గడవక ముందే మరో ముప్పు మురసు రూపంలో ముంచుకొచ్చింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం వద్ద తీరాన్ని దాటిన తుపాను ఈదురుగాలులు, జోరువానతో తీర ప్రాంతాలపై విరుచుకుపడింది. గాలిదుమారానికి పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగపడటంతో విద్యుత్ సరఫరా నిలిచి అధకారం ఏర్పడింది. తుపాను పరిస్థితిని ఆర్టీజీఎస్, విపత్తుల నిర్వహణ సంస్థ నిరంతరం పర్యవేక్షిస్తోంది. తుపాను సమస్యలను మనమిత్ర వాట్సాప్‌కు మెసేజ్ చేయాలని బాధితులకు సూచించింది.ఒంగోలులో అర్ధరాత్రి నుంచే తుపాను ప్రభావం మొదలైంది. భీకరగాలులకు సాయిబాబా గుడి వద్ద భారీ చెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడింది. విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగిపడటంతోవిద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఒంగోలు గాంధీ పార్కు సమీపంలో వర్షపు నీరు రోడ్డుపైకి చేరింది. ఒంగోలు కలెక్టరేట్ వద్ద రహదారిపై భారీ వృక్షం విరిగిపడింది. చెట్టు పడి టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం దెబ్బతింది.రహదారిపై భారీగా వరద నీరు: గుంటూరు జిల్లాలో ప్రత్తిపాడు, కాకుమాను, పెదనందిపాడు మండలాల్లో మురసు తుపాన్ బీభత్సం సృష్టించింది. పెదనందిపాడు మండలం వరగానిలో భారీ ఈదురు గాలులకు విద్యుత్తు స్తంభాలు నేలకూలి ద్విచక్ర వాహనాలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పెదనందిపాడు నుంచి కొమ్మూరు వెళ్లే బాపట్ల వెళ్లే ప్రధాన రహదారిపై పడిపోయిన భారీ వృక్షాన్ని పోలీసులు క్రేన్ సహాయంతో తొలగించారు. కాకుమాను ప్రధాన రహదారిపై నీరు మోకాళ్ల లోతులో నిలిచాయి. లోతట్టు ప్రాంతాలలో ఇళ్లలోకి నీరు చేరింది. పెదనందిపాడు-గుంటూరు రోడ్లుపై భారీగా వర్షపు నీరు నిలిచింది.42 పునరావాస కేంద్రాలు ఏర్పాటు: తీవ్ర తుపాను ప్రభావంతో బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంలో రాత్రి నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. ఈదురు గాలులతో వర్షం కురుస్తుండటంతో ప్రజలు బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. వర్ష ప్రభావానికి రేపల్లె-నిజాంపట్నం ప్రధాన రహదారిలో పలుచోట్ల రోడ్లు జలమయమై వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిజాంపట్నం, రేపల్లె మండలాల్లో 42 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ముంపునకు గురయ్యే సుమారు 600 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నిజాంపట్నం హార్బర్ వద్ద పదో నెంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. రేపల్లె, నిజాంపట్నం తీర ప్రాంతాల్లో బోట్లు నిలిచిపోయాయి. కొత్తపాలెం, నక్షత్ర నగర్, లంకెవానిదిబ్బ తీర ప్రాంత గ్రామాల్లోని ఫైబర్ బోట్లను మత్స్యకారులు దరికి చేర్చి, లంగర్లతో కట్టేశారు. మత్స్యకారులు ఎవరు వేటకు వెళ్లకుండా మత్స్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తున్నారు.విద్యుత్ సరఫరాకు అంతరాయం: బాపట్ల జిల్లాలో ఐదుగురు మత్స్యకారుల ఆచూకీ తెలియక కుటుంబసభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. చీరాల మండలం వాడరేవుకు చెందిన ఐదుగురు శుక్రవారం ఉదయం ఒకే బోటులో చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. వేటకు వెళ్లిన వారు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురవుతున్నారు. చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, కారంచేడు, అద్దంకి మండలాల్లో రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్లు నేలకూలి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షానికి చీరాల పట్టణం నీట మునిగింది. చినగంజాం మండలంలో అధికారులు 13 పునరావాసకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏటిమొగ, బాపయ్యనగర్‌కు చెందిన 51 మందిని పునరావాసకేంద్రానికి తరలించారు.క్షేత్ర స్థాయిలో 185 బృందాలు: తుపాను తీరం దాటే సమయంలో



బలమైన గాలులకు నెల్లూరు టంగుటూరు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. కొన్నిచోట్ల గోడ కూలి వాహనాలు దెబ్బతిన్నాయి. టంగుటూరులో ఇంటి పైకప్పు కూలింది. రాష్ట్ర వ్యాప్తంగా చెట్ల కట్ చేసి తొలగించేందుకు 185 బృందాలు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నాయని అగ్నిమాపక శాఖ డీజీ వెంకట రమణ తెలిపారు. వీరితో పాటు 47 బోట్ రెస్క్యూ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. అగ్నిమాపక శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమాండ్ కంట్రోల్ ద్వారా ఎప్పటికప్పుడు తుపాన్ సహాయక చర్యలను మానిటరింగ్ చేస్తున్నారు.వేమూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. కొల్లూరు మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షంతో రోడ్డు మార్జిన్ కనిపించక, కొల్లూరు నుంచి తెనాలి వెళ్తున్న కారు వేమూరు మార్కెట్ యార్డ్ వద్ద పంట కాలువలోకి దూసుకు వెళ్లింది. బాపట్ల నుంచి సూర్యలంకకు వెళ్లే రహదారి పూర్తిగా జలమయమైంది. పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. రహదారిపై కూలిన చెట్లతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అత్యవసరమైతే మినహా ప్రజలు బయటకు రావద్దని అధికారులు సూచించారు.

బద్వేలు మున్సిపాలిటీ కూటమి కైవసం.. క్లీన్‌స్వీప్‌తో సంపూర్ణ విజయం

బద్వేలు మున్సిపాలిటీని కైవసం చేసుకున్న టీడీపీ కూటమి

పోలింగ్ జరిగిన ఏకైక వార్డులో టీడీపీ అభ్యర్థి గెలుపు

ఇప్పటికే చైర్‌పర్సన్‌తో పాటు 39 వార్డులు ఏకగ్రీవం



ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార టీడీపీ కూటమి హవా కొనసాగిస్తోంది. కడప జిల్లాలోని బద్వేలు మున్సిపాలిటీని కూటమి పూర్తిస్థాయిలో కైవసం చేసుకుంది. ఈరోజు జరుగుతున్న ఓట్ల లెక్కింపులో... పోలింగ్ జరిగిన ఏకైక వార్డులోనూ టీడీపీ అభ్యర్థి విజయం సాధించడంతో ఈ క్లీన్‌స్వీప్ పూర్తయింది.బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 39వ వార్డుకు జరిగిన ఎన్నికలో టీడీపీ అభ్యర్థి తుడిమెళ్ల విజయ 372 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం 40 వార్డులున్న ఈ మున్సిపాలిటీలో కేవలం ఈ ఒక్క వార్డుకు మాత్రమే పోలింగ్ నిర్వహించారు. మిగిలిన 39 వార్డులు ఇప్పటికే ఏకగ్రీవం అయ్యాయి.ఎన్నికలకు ముందే మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని టీడీపీ అభ్యర్థి సోమేశుల దివ్య తేజ ఏకగ్రీవంగా గెలుచుకున్నారు. ఏకగ్రీవమైన 39 వార్డుల్లో టీడీపీ 35 స్థానాలు, జనసేన 2 స్థానాలు గెలుచుకోగా, మరో రెండు స్థానాలను స్వతంత్ర అభ్యర్థులు దక్కించుకున్నారు. తాజాగా 39వ వార్డులోనూ టీడీపీ గెలవడంతో బద్వేలు మున్సిపల్ కౌన్సిల్‌పై కూటమి సంపూర్ణ ఆధిపత్యాన్ని సాధించినట్లయింది. ఈ విజయంతో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

జిల్లాలకు విస్తరించనున్న ఇందిరమ్మ టవర్లు 5 నగరాల్లో నిర్మాణానికి కసరత్తులు

ఇప్పటికే క్యూర్ పరిధిలోని 25 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్లను నిర్మించారు. ప్రస్తుతం వాటిని ఇతర జిల్లాలకు కూడా విస్తరించాలని హౌసింగ్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది.పలు నగరాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మాణాలు ప్రారంభం కాగా, మరో ఐదు నగరాల్లో త్వరలో చేపట్టేందుకు హౌసింగ్ బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ఎల్ఐజీ ఫ్లాట్ల కోసం స్థలాలు సిద్ధం చేసిన ప్రభుత్వం, ఐదంస్తుల భవనాలకు ప్రణాళికలు చేసింది. హైదరాబాద్‌తో పోలిస్తే తక్కువ ధరకు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. క్యూర్ పరిధిలోని ఎల్బీనగర్, ముషీరాబాద్, గోషామహల్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక కోసం ఇవాళ హౌసింగ్ బోర్డు లాటరీ తీయనుంది.

మరో 5 నగరాల్లో నిర్మాణం

అల్పాదాయ వర్గాల సొంతింటి కల సాకారం కోసం ఉద్దేశించిన ఇందిరమ్మ టవర్ల పథకాన్ని రాష్ట్రంలో మరిన్ని నగరాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ కోర్ అర్బన్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఎల్ఐజీ ఫ్లాట్లను త్వరలో మరో 5 నగరాల్లో నిర్మించనుంది. మహబూబ్‌నగర్, నిజామాబాద్, నల్గొండ, వరంగల్, హనుమకొండలోని 6 నియోజకవర్గాల్లోని అల్పాదాయ వర్గాల కోసం ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డు కసరత్తు చేస్తోంది.



ఐదంతస్తులే నిర్మించేలా డిజైన్

మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 480 ఫ్లాట్లు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్‌లో పది అంతస్తుల టవర్లు నిర్మిస్తుండగా, జిల్లా కేంద్రాల్లో ఐదంతస్తులే నిర్మించేలా డిజైన్ చేస్తున్నారు. ఆ టవర్‌లో ఒక్కో అంతస్తుకు 12 ఫ్లాట్ల చొప్పున 528 చదరపు అడుగు బిల్డప్ ఏరియా, 400 కార్పెట్ ఏరియాతో సింగిల్ బెడ్ రూమ్‌లు నిర్మిస్తారు. ఆ 5 నగరాల్లో ఇప్పటికే స్థలాలు గుర్తించి సిద్ధం చేసిన హౌసింగ్ బోర్డు, హైదరాబాద్ తరహాలోనే విధి విధానాలు, అర్హతలను ఖరారు చేయాలని భావిస్తోంది.ఇందిరమ్మ టవర్లను నగరాల్లో నిర్మించేందుకు ఏర్పాటు

రూ.5 లక్షల సబ్సిడీ

ఎంపికైన లబ్ధిదారులకు స్థలం ఉచితంగా కేటాయించడం సహా నిర్మాణానికయ్యే ఖర్చులో రూ.5 లక్షలు సబ్సిడీగా ప్రభుత్వం అందిస్తుంది. మిగతా నిర్మాణ ఖర్చును లబ్ధిదారులు నాలుగు విడతల్లో చెల్లించాల్సి ఉంటుంది. వార్షికాదాయం రూ.6 లక్షల వరకు ఉండి నగరంలో స్థలం లేనివారికి ఎల్ఐజీ ఫ్లాట్లకు పరిగణనలోకి తీసుకుంటారు. దరఖాస్తుతో పాటు రూ.పది వేలు చెల్లించిన తర్వాత అర్హులకు లాటరీ ద్వారా ఫ్లాట్ కేటాయిస్తారు. అర్హతలు, డిజైన్లు, విధి విధానాలపై త్వరలో కేబినెట్‌లో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

25 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్లు

హైదరాబాద్ కోర్ అర్బన్‌లో తొలి విడతలో 25 నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా ఇందిరమ్మ టవర్లు నిర్మిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపికతో పాటు టవర్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయగా, కొన్నిచోట్ల నిర్మాణాలు మొదలుపెట్టారు. ఎల్బీనగర్, ముషీరాబాద్, గోషామహల్, చాంద్రాయణగుట్టలో లబ్ధిదారుల ఎంపిక కోసం ఇవాళ లాటరీ తీయనున్నారు. ఉప్పల్, జూబ్లీహిల్స్, చార్మినార్, యాకుత్‌పురా, సికింద్రాబాద్‌లో స్థలాల కోసం ప్రభుత్వం అన్వేషిస్తోంది.

రాయదుర్గం ప్రజలు మమ్మల్ని విశ్వసించారు.. అఖండ మెజారిటీ ఇచ్చారు

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం : ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



రాయదుర్గం తెలుగుకలం ప్రతినిధి : రెండేళ్ల కూటమి పాలన తర్వాత కూడా తమపై పూర్తి విశ్వాసం ఉంచి రాయదుర్గం ప్రజలు కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హర్షం వ్యక్తపరిచారు. కూటమి తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసిన టంకశాల హనుమంతును 15,500కు పైగా ఓట్ల మెజారిటీతో గెలిపించి రాయదుర్గం ప్రజలు కూటమికి అండగా నిలిచారని కొనియాడారు. రాయదుర్గం పట్టణంలో మంగళవారం సాయంత్రం చైర్మన్ అభ్యర్థి హనుమంతును అభినందించిన సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంపై, స్థానికంగా తాను అందిస్తున్న సేవలపై, కూటమి అభ్యర్థి టంకశాల హనుమంతు గుణగణాలపై ప్రజలు పూర్తి విశ్వాసం ఉంచారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో తనకు 15,900కు పైగా మెజారిటీ ఇచ్చిన ప్రజలు, నేటి ఎన్నికల్లోనూ అదే అభిమానాన్ని చాటుతూ 15,500కు పైగా మెజారిటీ అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అఖండ మెజారిటీతో గెలిపించిన రాయదుర్గం ప్రజల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. రాయదుర్గం మున్సిపాలిటీలో అవినీతికి తావులేని పారదర్శక పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా పనిచేస్తారని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీలపై ఎలాంటి విమర్శలు చేయకుండా, పల్లెత్తు మాట కూడా అనకుండా కేవలం రెండేళ్ల కూటమి పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను మాత్రమే ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించామని చెప్పారు. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఏయే వార్డుల్లో పోటీ చేస్తున్నారనే విషయాన్ని కూడా పట్టించుకోకుండా, రెండేళ్ల పాలన తర్వాత ప్రజలు తమపై ఎంతటి విశ్వాసం చూపిస్తున్నారో తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ఎన్నికలను ఎదుర్కొన్నామని వివరించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి రాయదుర్గం ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారనేందుకు ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమన్నారు. తమపై ఇంతటి నమ్మకం ఉంచి అఖండ విజయాన్ని అందించిన పట్టణ ప్రజలందరికీ మనస్ఫూర్తిగా చేతులెత్తి నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, ఇతర పట్టణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా రాయదుర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌లో మరో జాతీయ స్థాయి కార్యక్రమం

27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీలకు వేదిక కానున్న నగరం

27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలకు నగరం వేదికగా మారింది. ఈ పోటీలు నవంబర్ 16 నుంచి 20 వరకు జరగనున్నాయి.హైదరాబాద్‌లో మరో జాతీయ స్థాయి కార్యక్రమానికి రంగం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఉన్న పోలీస్ బలగాల్లోని సంగీత, కళాత్మక ప్రతిభను చాటేందుకు 27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ కాంపిటీషన్స్‌కు నగరం వేదిక కానుంది. ఈ మేరకు రంగారెడ్డి సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో కర్టెన్ రైజర్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సంగీత దర్శకులు, ఆస్కార్ విన్నర్ ఎం.ఎం కీరవాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఆలిండియా పోలీస్ బ్యాండ్ కాంపిటీషన్ కార్యక్రమం

జాతీయ స్థాయి పోలీస్ బ్యాండ్ పోటీలకు హైదరాబాద్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ ఏడాది 27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ కాంపిటీషన్స్ నిర్వహణ బాధ్యతను సీఆర్పీఎఫ్ సౌత్ సెక్టార్ తీసుకుంది. ఈ పోటీలకు సంబంధించిన కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీల మస్కట్, లోగో, టీజర్, షెడ్యూల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సీపీ సుమతి, సీఆర్పీఎఫ్ ఐజీ టి.విక్రమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎం.కీరవాణి ట్రిపుల్ ఆర్ సినిమాలోని 'జనని' పాటను లైవ్‌గా పాడి అక్కడున్న సీఆర్పీఎఫ్ సైనికులను, పోలీసులను ఆకట్టుకున్నారు.

పోటీలో సీఆర్పీఎఫ్ నుంచి అత్యుత్తమ బ్యాండ్ బృందాలు

ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు సీఆర్పీఎఫ్ గ్రూప్



సెంటర్‌లో 5 రోజుల పాటు ఈ బ్యాండ్ పోటీలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల పోలీస్ విభాగాలు, సీఆర్పీఎఫ్ నుంచి సుమారు 25 నుంచి 30 అత్యుత్తమ బ్యాండ్ బృందాలు ఇందులో తలపడనున్నాయి. పురుషులు, మహిళల విభాగాల్లో వేర్వేరుగా బ్రాస్, పైప్ బ్యాండ్స్ కాంపిటీషన్స్ జరుగుతాయని ఎం.ఎం. కీరవాణి వెల్లడించారు.దేశవ్యాప్తంగా పోలీసులకు సంబంధించిన 25 నుంచి 30 టీంలు ఈ 27వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ కాంపిటీషన్స్‌లో పాల్గొంటాయి. ఇందులో మహిళలు, పురుషులు ఉంటారు. ఇది 5 రోజుల పాటు జరగనుంది. ఆల్ ఇండియా స్పోర్ట్స్ పోలీస్ కంట్రోల్ బోర్డు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తారు. దీని ద్వారా పోలీసుల మధ్య సత్సంబంధాలు, క్రమశిక్షణ పెంచడమే ధ్యేయం - విక్రమ్, సీఆర్పీఎఫ్ ఐజీ

ప్రజలు, విద్యార్థులూ వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు

పోలీసుల ప్రతిభను కేవలం పోటీలకే పరిమితం చేయకుండా సామాన్య ప్రజలు, విద్యార్థులు కూడా వీక్షించేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17, 18 తేదీల్లో సాయంత్రం ఐదున్నర గంటల నుంచి శిల్పారామం, లుంబినీ పార్కుల్లో పబ్లిక్ బ్యాండ్ డిస్‌ప్లేను ఏర్పాటు చేస్తున్నారు. ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఈవెంట్ ద్వారా వివిధ రాష్ట్రాల పోలీసుల మధ్య సత్సంబంధాలు పెంచడంతో పాటు, జాతీయ సమైక్యత, క్రమశిక్షణను చాటి చెప్పడమే ప్రధాన ఉద్దేశమని సీఆర్పీఎఫ్ అధికారులు చెబుతున్నారు.పోలీసుల్లో దాగి ఉన్న సంగీత, కళాత్మక ప్రతిభను బయటపెట్టేందుకు ఈ బ్యాండ్ కాంపిటీషన్స్ ఒక మంచి ప్లాట్‌ఫామ్‌గా నిలవనున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఫోర్సెస్ అంతా ఒక్కచోట చేరి తమ టాలెంట్‌ను చూపించనున్నారు.

మిగిలిపోయిన అన్నంతో చీజీ రైస్ బాల్స్ ఇలా చేస్తే ప్లేట్ ఖాళీ చేస్తార



వంటగదిలో మిగిలిపోయిన అన్నాన్ని వృథా చేయకుండా, రుచికరమైన చీజీ రైస్ బాల్స్‌గా మార్చే సులభమైన రెసిపీని తెలుసుకుందాం. ఈ వంటకం సాధారణ పదార్థాలతో తయారవుతుంది, సమయాన్ని ఆదా చేస్తుంది పిల్లల నుండి పెద్దల వరకు అందరికీ ఇష్టమైన స్నాక్‌గా నిలుస్తుంది. ఏదు సులభమైన స్టెప్స్ తో ఈ రెసిపీ తయారు చేయడం ఎంతో సులభం. అంతేకాదు ఆహార వృథాను తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుంది. ఈ రెసిపీని తయారు చేయడానికి మొదటగా వంటగదిలో మిగిలిపోయిన అన్నాన్ని సేకరించడం ముఖ్యం. ఇది సాదా అన్నం కావచ్చు లేదా కూరగాయలు కలిపిన అన్నం కావచ్చు. అన్నం కొంచెం పొడిగా ఉంటే, అది రైస్ బాల్స్ తయారీకి బాగా సరిపోతుంది. ఈ దశలో అన్నాన్ని ఒక పెద్ద గిన్నెలోకి తీసుకుని, దానిని చేతితో కొద్దిగా విరిచి మెత్తగా చేయాలి, తద్వారా ఇతర పదార్థాలతో కలపడం సులభమవుతుంది.

రుచికరమైన పదార్థాలను జోడించడం

అన్నంలో రుచిని పెంచడానికి, సన్నగా తరిగిన ఉల్లిపాయలు, క్యారెట్, బీన్స్ లేదా ఇతర కూరగాయలను జోడించాలి. ఈ కూరగాయలు మిశ్రమానికి క్రంచీ టెక్స్చర్‌ను అందిస్తాయి. అలాగే, కొద్దిగా ఉప్పు, మిరియాల పొడి, మరియు గరం మసాలా వంటి సుగంధ ద్రవ్యాలు చల్లితే రుచి మరింత ఆకర్షణీయంగా మారుతుంది. ఈ దశలో అన్ని పదార్థాలను బాగా కలపడం ముఖ్యం, తద్వారా రుచి సమానంగా వ్యాపిస్తుంది.

చీజ్‌తో రుచిని పెంచడం

ఈ రెసిపీకి ప్రత్యేక ఆకర్షణ చీజ్. మొజారెల్లా లేదా చెడ్డార్ చీజ్‌ను తురిమి అన్నం మిశ్రమంలో కలపాలి. చీజ్ రైస్ బాల్స్‌కు క్రీమీ టెక్స్చర్ మరియు రిచ్ రుచిని జోడిస్తుంది. చీజ్‌ను మిశ్రమంలో సమానంగా కలిపితే, బాల్స్ వేయించినప్పుడు లోపల మెత్తగా, బయట క్రిస్పీగా ఉంటాయి, ఇది స్నాక్‌ను మరింత ఆకర్షణీయంగా చేస్తుంది.

మిశ్రమాన్ని బాల్స్ చుట్టడం

మిశ్రమం సిద్ధమైన తర్వాత, దానిని చిన్న చిన్న బాల్స్ గా చుట్టడం తదుపరి దశ. చేతులను కొద్దిగా నీటితో తడిచేసుకుంటే మిశ్రమం అంటుకోకుండా సులభంగా బాల్స్ గా చుట్టవచ్చు. బాల్స్ గా చిన్నగా ఉండేలా చూసుకోవాలి, తద్వారా అవి సమానంగా వేగుతాయి మరియు సర్వ్ చేయడానికి అనుకూలంగా ఉంటాయి. ఈ దశలో మిశ్రమాన్ని గట్టిగా నొక్కి ఆకారం ఇవ్వడం ముఖ్యం.

బ్రెడ్‌క్రంబ్స్‌తో కోటింగ్ చేయడం

రైస్ బాల్స్‌ను క్రిస్పీగా మార్చడానికి, వాటిని బ్రెడ్‌క్రంబ్స్‌తో కోట్ చేయాలి. ముందుగా, బాల్స్ గా కొట్టిన గుడ్డు లేదా కార్న్‌ఫ్లోర్ మిశ్రమంలో ముంచి, ఆ తర్వాత బ్రెడ్‌క్రంబ్స్‌లో రోల్ చేయాలి. ఈ కోటింగ్ ఐంతులుగా గోల్డెన్ క్రస్ట్‌ను అందిస్తుంది మరియు వేయించినప్పుడు అదనపు క్రంచీనెస్‌ను జోడిస్తుంది.

రైస్ బాల్స్‌ను వేయించడం

తయారుచేసిన రైస్ బాల్స్‌ను మీడియం వేడి నూనెలో లోతుగా వేయించాలి. నూనె చాలా వేడిగా ఉంటే బయట కాలిపోయే అవకాశం ఉంది, కాబట్టి వేడిని నియంత్రించడం ముఖ్యం. వీటిని జాగ్రత్తగా నూనెలో వేసి, అన్ని వైపులా గోల్డెన్ బ్రౌన్ రంగు వచ్చేవరకు వేయించాలి. వేగిన తర్వాత, వాటిని కాగితపు టవల్‌పై ఉంచి అదనపు నూనెను తొలగించాలి.

సాస్‌తో సర్వ్ చేయడం

చీజీ రైస్ బాల్స్‌ను రుచికరమైన సాస్‌తో సర్వ్ చేయడం ఈ వంటకానికి అదనపు ఆకర్షణను జోడిస్తుంది. టమోటా కెచప్, మయోన్నైస్, లేదా స్పైసీ చట్నీ వంటి సాస్‌లు ఈ స్నాక్‌కు బాగా సరిపోతాయి. వేడిగా ఉన్న రైస్ బాల్స్‌ను సాస్‌తో ప్లేట్‌లో అందంగా అలంకరించి సాయంత్రం టీ సమయంలో లేదా పార్టీలలో సర్వ్ చేయవచ్చు, ఇది అందరినీ ఆకట్టుకుంటుంది.

అవిసె గింజలు రోజూ తింటే ఆ వ్యాధి నయమవుతుందా వైద్యులు ఏమంటున్నారు



అవిసె గింజలు, ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన సూపర్‌ఫుడ్‌గా పిలుస్తారు. ఇవి మన ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, ఫైబర్, లిగ్నాన్స్ వంటి పోషకాలతో నిండిన ఈ గింజలు గుండె ఆరోగ్యం నుండి మధుమేహ నియంత్రణ వరకు అనేక విధాలుగా ఉపయోగపడతాయి. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారికి ఈ గింజలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అవిసె గింజల ఆరోగ్య ప్రయోజనాలను వాటిని ఆహారంలో ఎలా చేర్చుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.. అవిసె గింజలు మధుమేహం ఉన్నవారికి గొప్ప ఆహార ఎంపికగా పనిచేస్తాయి. ఈ గింజల్లోని అధిక ఫైబర్ కంటెంట్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఫైబర్ ఆహారంలోని చక్కెర శోషణను నెమ్మదిస్తుంది, దీనివల్ల రక్త గ్లూకోస్ స్థాయిలు అకస్మాత్తుగా పెరగవు. కొన్ని పరిశోధనల ప్రకారం, రోజూ 10 గ్రాముల అవిసె గింజల పొడిని తీసుకోవడం వల్ల టైప్-2 మధుమేహం ఉన్నవారిలో ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. ఈ గింజలు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి, ఇది మధుమేహ నిర్వహణలో కీలకం.

గుండె ఆరోగ్యానికి మేలు

అవిసె గింజల్లో ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లం రూపంలో పుష్కలంగా ఉంటుంది, ఇది గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఈ గింజలు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. రోజూ అవిసె గింజలను తీసుకోవడం వల్ల రక్తపోటు తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి, ముఖ్యంగా ప్రీ-డయాబెటిక్ రోగులలో సిస్టాలిక్ రక్తపోటు గణనీయంగా తగ్గుతుంది. ఈ గింజల్లోని లిగ్నాన్స్ మరియు ఫైబర్ గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి, ఇవి గుండె సంబంధిత సమస్యల నివారణకు సహజమైన మార్గంగా పనిచేస్తాయి.

జీర్ణక్రియ బరువు నియంత్రణ

అవిసె గింజల్లో ద్రావణీయ మరియు ద్రావణీయం కాని ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది మరియు మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. ఈ ఫైబర్ ఆకలిని నియంత్రిస్తూ ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, ఇది బరువు నియంత్రణకు సహాయపడుతుంది. అధిక బరువు లేదా ఊబకాయం ఉన్నవారికి అవిసె గింజలు ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీర బరువు మరియు బాడీ మాస్ ఇండెక్స్ తగ్గుతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ గింజలు జీవక్రియను మెరుగుపరచడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహిస్తాయి.

క్యాన్సర్ నివారణలో సహాయం

అవిసె గింజల్లో లిగ్నాన్స్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, ఇవి క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్‌ల ప్రమాదాన్ని తగ్గించడంలో ఈ గింజలు సహాయపడతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. లిగ్నాన్స్ కణాల మరణాన్ని ప్రేరేపిస్తాయి మరియు గడ్డలకు రక్త సరఫరాను తగ్గిస్తాయి, ఇది క్యాన్సర్ వ్యాప్తిని నిరోధిస్తుంది. అవిసె గింజలను రోజూ తీసుకోవడం వల్ల క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే కీమోథెరపీ మందుల సామర్థ్యాన్ని కూడా పెంచుతుంది.

చర్మం జుట్టు ఆరోగ్యం

అవిసె గింజల్లోని ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు మరియు యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఈ గింజలు చర్మంలో తేమను నిలుపుకోవడం, చర్మం యొక్క ఒరిగిపోవడం మరియు సున్నితత్వాన్ని తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తాయి. అవిసె గింజలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల గాయాలు త్వరగా నయం అవుతాయి మరియు చర్మం సహజమైన గ్లోను పొందుతుంది. అదే విధంగా, ఈ గింజల్లోని పోషకాలు జుట్టు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి, జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి మరియు జుట్టును బలంగా మారుస్తాయి.

ఎలా తీసుకోవాలి?

అవిసె గింజల పూర్తి ప్రయోజనాలను పొందడానికి, వాటిని సరైన రూపంలో తీసుకోవడం ముఖ్యం. మొత్తం గింజలు జీర్ణం కావడం కష్టం కాబట్టి, వాటిని పొడి చేసి తీసుకోవడం ఉత్తమం. ఈ పొడిని స్మూతీలు, పెరుగు, సలాడ్‌లు లేదా చపాతీ పిండిలో కలిపి తీసుకోవచ్చు. రోజుకు 1-2 టీస్పూన్ల అవిసె గింజల పొడి తీసుకోవడం సురక్షితం మరియు ప్రయోజనకరం. అయితే, మధుమేహ మందులు తీసుకునే వారు లేదా రక్తపోటు సమస్యలు ఉన్నవారు ఈ గింజలను ఆహారంలో చేర్చే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది, ఎందుకంటే అవిసె గింజలు కొన్ని మందులతో సంకర్షణ చెందవచ్చు

మామిడి పండు తొక్కలో షాకింగ్ బెనిఫిట్స్ దీంతో ఏమేం చేయొచ్చో తెలిస్తే ఇంకెప్పుడూ పడేయరు



వేసవిలో దొరికే మ్యాజికల్ ఫ్రూట్ ఏది అంటే మామిడి పళ్లే అంటారు. రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం ఇవ్వడమే కాకుండా దీని వల్ల ఇంకా ఎన్నో ప్రయోజనాలున్నాయి. మామిడి పండు తినేసి తొక్కను పడేస్తుంటాం. కానీ, తొక్కతో కూడా కొన్ని రుచికరమైన రెసిపీలను తయారు చేయొచ్చు. దీని రుచి పండు రేంజ్ కు ఏమాత్రం తీసిపోదు. అవేంటో చూద్దాం.. మామిడి సీజన్‌లో మనం ఎక్కువగా పండు గుజ్జును ఆస్వాదిస్తాం, కానీ తొక్కలను విసిరేస్తాం. అయితే, ఈ మామిడి తొక్కలతో రుచికరమైన సృజనాత్మక వంటకాలను తయారు చేయడానికి ఏదు సులభమైన రెసిపీలను పరిచయం చేస్తుంది. చట్నీలు, జామ్‌లు, రిఫ్రెషింగ్ డ్రింక్స్ మరియు స్వీట్‌ల వరకు, ఈ రెసిపీలు వంటగదిలో సమయాన్ని ఆదా చేస్తూ కొత్త రుచులను అందిస్తాయి. ఈ వంటకాలు సాధారణ పదార్థాలతో తయారవుతాయి, ఆరోగ్యానికి మేలు చేస్తాయి ఆహార వృథాను తగ్గిస్తాయి.

మామిడి తొక్క చట్నీ

మామిడి తొక్కలతో స్పైసీ చట్నీ తయారు చేయడం ఒక అద్భుతమైన ఆలోచన. తొక్కలను చిన్న ముక్కలుగా కట్ చేసి, వెల్లుల్లి, ఆవాలు, ఎండుమిర్చి, కొద్దిగా చక్కెరతో కలిపి వేడి నూనెలో వేయించితే రుచికరమైన చట్నీ సిద్ధమవుతుంది. ఈ చట్నీ అన్నం, ఇడ్లీ, దోసెలతో సర్వింగ్ చేయడానికి అనువైనది మరియు తొక్కల్లోని ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుంది.

మామిడి తొక్క జామ్

మామిడి తొక్కలను ఉపయోగించి తీపి జామ్ తయారు చేయడం మరొక సులభమైన రెసిపీ. తొక్కలను బాగా కడిగి, మెత్తగా గ్రైండ్ చేసి, చక్కెర, నిమ్మరసంతో కలిపి మందమైన అంటున ఉడికించాలి. ఈ జామ్ రొట్టె, చపాతీ లేదా టోస్ట్‌పై స్ప్రెడ్ చేసి ఆస్వాదించవచ్చు. ఇది తొక్కల్లోని విటమిన్ సి యాంటీఆక్సిడెంట్లను సంరక్షిస్తూ రుచిని అందిస్తుంది.

మామిడి తొక్క టీ

మామిడి తొక్కలతో రిఫ్రెషింగ్ టీ తయారు చేయడం ఆరోగ్యానికి మేలు చేసే ఆలోచన. తొక్కలను ఎండబెట్టి, మెత్తగా పొడి చేసి, వేడి నీటిలో వేసి కాసేపు ఉడకనివ్వాలి. ఈ టీకి కొద్దిగా తేనె లేదా చక్కెర జోడించి సిప్ చేయవచ్చు. ఈ హెర్బల్ టీ శరీరంలోని విష పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది మరియు రోగనిరోధక శక్తిని పెంచుతుంది.

మామిడి తొక్క పచ్చడి

మామిడి తొక్కలతో సాంప్రదాయ పచ్చళ్లు తయారు చేయడం ఆహార ప్రియులకు అద్భుతమైన ఎంపిక. తొక్కలను చిన్న ముక్కలుగా కట్ చేసి, ఆవాలు పొడి, ఉప్పు, మిరప పొడి, నూనెతో కలిపి కొన్ని రోజులు ఎండలో ఉంచితే రుచికరమైన అచార్ సిద్ధమవుతుంది. ఈ అచార్ భోజనానికి అదనపు రుచిని జోడిస్తుంది మరియు ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

మామిడి తొక్క స్మూతీ

మామిడి తొక్కలతో ఆరోగ్యకరమైన స్మూతీ తయారు చేయడం సులభమైన రిఫ్రెషింగ్ రెసిపీ. తొక్కలను బాగా కడిగి, పెరుగు, తేనె, మరియు ఇతర పండ్లతో కలిపి బ్లెండ్ చేయాలి. ఈ స్మూతీ విటమిన్లు మరియు ఫైబర్‌తో నిండి ఉంటుంది, ఉదయం లేదా సాయంత్రం స్నాక్‌గా ఆదర్శంగా ఉంటుంది.

మామిడి తొక్క క్యాండీ

మామిడి తొక్కలతో తీపి క్యాండీ తయారు చేయడం పిల్లలు మరియు పెద్దలకు ఇష్టమైన ట్రీట్. తొక్కలను సన్నగా కట్ చేసి, చక్కెర సిరప్‌లో ఉడికించి, ఎండబెట్టాలి. ఈ క్యాండీ సహజమైన తీపిని అందిస్తుంది మరియు ఆరోగ్యకరమైన స్నాక్‌గా ఉపయోగపడుతుంది.

ఇవి మీ ఇంట్లో ఉంటే అదృష్టం మీ వెంటే ఇక తిరుగులేదు డబ్బే డబ్బు

ఇంట్లో చేపల్ని పెంచే అలవాటు చాలా మందిలో ఉంటుంది. ముఖ్యంగా అక్వేరియంలో రంగు రంగుల చేపలు ఉండటం చూడటానికి బాగుంటుంది. కానీ కొన్ని ప్రత్యేకమైన చేపలు ఉంటే అదృష్టం కూడా కలిసివస్తుందని వాస్తు నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు వాటి గురించి తెలుసుకుందాం. డ్రాగన్ ఫిష్ ఇంట్లో పెంచితే మంచి ఫలితాలు వస్తాయని నమ్మకం ఉంది. వాస్తు ప్రకారం ఈ చేప సంపదను ఆకర్షిస్తుందని చెబుతారు. దాంతో పాటు ఇంట్లో శ్రేయస్సు పెరుగుతుంది. గోల్డ్ ఫిష్ ఉండటం వల్ల ఇంట్లో ప్రశాంతత వస్తుంది. అదృష్టం కూడా కలుగుతుంది. దీని వల్ల ధనసంపత్తి పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు రావు అని కూడా అంటున్నారు. బ్లాక్ మూర్ గోల్డ్ ఫిష్.. ఇది ఇంట్లో ఉన్నప్పుడు పాజిటివ్ ఎనర్జీ పెరుగుతుంది. చెడు దృష్టి ప్రభావం తగ్గుతుంది. ప్రశాంతతతో పాటు ఇంట్లో మంచి వాతావరణం ఏర్పడుతుంది. అదృష్టం కలగడం సహజమే అని అంటున్నారు. కోయ్ ఫిష్ ఇంట్లో పెంచితే అదృష్టం వస్తుందని నమ్మకం ఉంది. ఇది పాజిటివ్ శక్తిని తీసుకురాగలదు. ఈ చేప ధన లాభానికి తోడ్పడుతుంది. ఇల్లు ఆనందంగా మారుతుంది. ఫ్లవర్ హార్న్ ఫిష్.. ఈ చేపల్ని ఇంట్లో పెంచితే అదృష్టం చేకూరుతుంది. ఫెంగ్ షుయ్ లో కూడా ఈ చేపలను మంచి సంకేతంగా చెబుతారు. ఇది ఇంటికి శాంతిని తీసుకురాగలదు. మొల్లిస్ చేపలు.. నలుపు రంగు లేదా సిల్వర్ రంగులో ఉండే మొల్లిస్ చేపలు ఇంట్లో ఉన్నప్పుడు సానుకూల శక్తి చుట్టూ వ్యాపిస్తుంది. ఇంట్లో నిండుగా శుభ వాతావరణం ఏర్పడుతుంది. ఆర్థిక సమస్యలు తగ్గుతాయని చెబుతారు. ఏంజెల్ చేపలు ఇంట్లో ఉంటే మంచి అందం వస్తుంది. ఇంకా ప్రశాంతంగా అనిపిస్తుంది. అదృష్టం కూడా వస్తుందంటారు. వీటిని ఇంట్లో ఉంచితే వాతావరణం కూడా కూల్‌గా ఉంటుందట. బెట్టా ఫిష్ చాలా అందంగా కనిపిస్తాయి. ఈ చేప ధైర్యానికి ప్రతీకగా చెప్పబడుతుంది. ఇంట్లో ఉండటం వల్ల ధైర్యంగా ఉండే శక్తి పెరుగుతుంది. అదృష్టం



కూడా వెంట పడుతుంది. సానుకూలత చుట్టూ ఏర్పడుతుంది. ఇలాంటి చేపలను ఇంట్లో పెంచితే మనసుకు శాంతి, డబ్బు లాభం, అదృష్టం కలుగుతాయని చాలా మంది నమ్ముతారు. కానీ వాటిని బాగా చూసుకోవాలి. వాటికి కావలసిన శుభ్రత, తిండి పెట్టాలి. అప్పుడే ఆ మంచి ఫలితాలు నిజంగా వస్తాయి.

ఈ పండ్లు చిన్నగున్నా మీ చర్మాన్ని మాత్రం యవ్వనంగా ఉంచుతాయి



వేసవి కాలంలో చర్మం బాగా ప్రభావితమవుతుంది. ఎక్కువ ఉష్ణోగ్రతల వల్ల చర్మం పొడిబారిపోయి మంట వస్తుంది. కానీ సరైన ఆహారం తీసుకుంటే చర్మాన్ని చల్లబరచుకోవచ్చు. వేసవిలో శరీరం హైడ్రేట్ గా ఉండటం చాలా అవసరం. అలాంటి తేమ ఉండే ఆహారాలు తీసుకుంటే చర్మం మెరిసిపోతుంది. ఎండకు తట్టుకోగల శక్తి కూడా పెరుగుతుంది. పుచ్చకాయ వేసవిలో అత్యంత ముఖ్యమైన పండు. ఇది శరీరానికి తేమను అందిస్తుంది. ఇందులో విటమిన్-ఎ, బి, సి ఉంటాయి. ఇవి చర్మాన్ని తాజాగా ఉంచుతాయి. వేసవిలో ఎక్కువ చెమట వస్తుంది. అప్పుడు ఈ పండు తినడం వల్ల శరీరంలోని నీరు తగ్గకుండా ఉంటుంది. చర్మం పొడిబారకుండా ఉండి ఆరోగ్యంగా కనిపిస్తుంది. టమాటోలో లైకోపీన్ అనే ముఖ్యమైన పదార్థం ఉంటుంది. ఇది చర్మాన్ని ఎండ నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. రోజూ టమాటోను ఆహారంలో భాగంగా తీసుకుంటే చర్మం మెరుస్తూ ఉంటుంది. బయట తిరిగే వారు దీన్ని తప్పకుండా తీసుకోవాలి. ఇది సహజమైన సన్ స్క్రీన్ లా పని చేస్తుంది. పెరుగు తినడం వల్ల కడుపు శుద్ధి అవుతుంది. ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ వల్ల గట్ కి మేలు కలుగుతుంది. ఇది శరీరంపై మంచి ప్రభావం చూపుతుంది. కడుపు శుద్ధి అవడం వల్ల చర్మం మీద కూడా ప్రకాశం కనిపిస్తుంది. వేసవిలో రోజూ పెరుగు తినడం వల్ల శరీరం చల్లగా ఉండి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. బెర్రీ పండ్లలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ అనే హానికర పదార్థాలను తగ్గిస్తాయి. చర్మాన్ని లోపల నుంచి రక్షిస్తాయి. ఇంకా ఈ పండ్ల వల్ల చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. కొల్లాజెన్ పెరగడం వల్ల చర్మం గట్టిగా మెరుస్తూ ఉంటుంది. యవ్వనంగా కనిపించడానికి బెర్రీలు సహాయపడతాయి. దోసకాయ తినడం వల్ల శరీరం చల్లబడుతుంది. ఇందులో సిలికా అనే పదార్థం ఉంటుంది. ఇది చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. వేసవిలో చర్మం మంటగా అనిపించొచ్చు. అలాంటి సమయంలో దోసకాయ తినడం వల్ల చర్మం ప్రకాశవంతంగా ఉంటుంది. ఇది శరీరానికి సహజ చల్లదనం ఇచ్చే ఆహారం. వేసవిలో సరైన ఆహారంతో పాటు శుద్ధమైన నీరు తాగడం కూడా అవసరం. ఎండలో ఎక్కువ సమయం గడపడం తగ్గించాలి. తేమ ఉండే ఆహారాలు, తాజా పండ్లు, కూరగాయలు తినాలి. ఇవి చర్మాన్ని లోపల నుంచి బలంగా ఉంచుతాయి.

అందగత్తెల ఆనందం కోసం అదిరిపోయే లుక్ కొత్తరూపు దిద్దుకున్న చారిత్రక నిర్మాణాలు



మిస్ వరల్డ్ పోటీలకు తొలిసారి తెలంగాణ ఆతిథ్య మిస్తుంది.. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న విశ్వ వ్యాప్త అందగత్తెలు తెలంగాణలోని వివిధ ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాలను సందర్శించనున్నారు.. రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన యునెస్కో గుర్తింపుపొందిన నిర్మాణం రామప్ప, వేయి స్తంభాలగుడి ఖిలా వరంగల్ సందర్శనకు వస్తుండడంతో అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.. ఆ చారిత్రక నిర్మాణాలను చూసి సుందరీమణులు వావ్ అనిపించేలా కొత్త రూపుదిద్దుకున్నాయి.. విద్యుత్ దీపాల కాంతులతో వెలిగిపోతున్నాయి.. అందగత్తలను మించిన అందంతో మురిసిపోతున్న ఆ చారిత్రక నిర్మాణాలు ఎలా దగదగలాడుతున్నాయో ఓ లుక్కేయండి మిస్ వరల్డ్ పోటీలకు తొలిసారి తెలంగాణ గడ్డ వేదిక అయింది.. హైదరాబాద్ మహానగరం ఇప్పటికే విశ్వసుందరులను అబ్బురపరిచేలా కొత్త రూపుదిద్దుతుంది..అతిథ్యం అదరహో అనిపించింది.. ఇక ఆ సుందరిమణులు తెలంగాణ లోని ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలు, పుణ్యక్షేత్రాల సందర్శనకు రూట్ మ్యాప్ రెడీ అవ్వడంతో అక్కడ చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి సుందరీమణుల రాక కోసం సర్వం సిద్ధమైంది..14 వ తేదీన 116 దేశాలకు చెందిన అందబామలు ఓరుగల్లు కు రాబోతున్నారు.. కాకతీయ వాసరత్వ సంపద వేయి స్తంభాలగుడి, రామప్ప, కిలా వరంగల్ పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తారు..

వేసవిలో పూల్ మఖానాని ఇలా తింటే బోలెడన్నీ బెనిఫిట్స్..!

వారికి ఘనస్వాగతం పలికి అబ్బురపోయేలా ఏర్పాట్లు చేస్తున్నారు..భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.. ఖిలా వరంగల్ కోట, రామప్ప, వేయి స్తంభాలగుడి విద్యుత్ దీపాల కాంతులతో వెలిగి పోతున్నాయి.. ఖిలా వరంగల్ కోట లో సౌండ్స్ అండ్ లైటింగ్ షో ఏర్పాటు చేశారు. 116 దేశాలకు చెందిన అందమైనబామలు ప్రత్యేక వాహనాలలో 14 వ తేదీ సాయంత్రం హనుమకొండ కు చేరుకుంటారు..హనుమకొండ హరిత కాకతీయ హోటల్ లో కొంతసేపు విశ్రాంతి తీసుకొని అక్కడి సాయంత్రం 5 గంటలకు రెండు బృందాలుగా విడిపోతారు.. ఒక గ్రూప్ యూనిస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం సందర్శకు వెళ్తుంది.. మరో గ్రూప్ వేయి స్తంభాల గుడి, ఖిలా వరంగల్ కోట సందర్శిస్తారు.. సుందరిమణులు సందర్శించిన పర్యాటక ప్రదేశాలన్నీ ఇప్పుడు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.. ప్రత్యేక మెనూ తో వంటకాలను రెడీ చేస్తున్నారు.. మరోవైపు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు..

షుగర్ ఉన్నవారు రోజూ కొబ్బరి నీళ్లు తాగితే ఏమౌతుందో తెలుసా



కొబ్బరి నీళ్లు శరీరానికి శక్తిని అందించే ప్రకృతిసిద్ధమైన డ్రింక్. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, ఎలక్ట్రోలైట్స్, కరిగే ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడతాయి. వేసవి కాలంలో లేదా శ్రమ ఎక్కువగా చేసినప్పుడు కొబ్బరి నీళ్లు తాగితే శరీరానికి ఉత్సాహం లభిస్తుంది. అయితే మధుమేహం ఉన్నవారికి ఇది పూర్తిగా మంచిదా..? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. కొబ్బరి నీళ్లలో సహజంగా ఉండే ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి చక్కెర పదార్థాల ప్రభావం మీద శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంటుంది. ఎందుకంటే కొబ్బరి నీళ్లు తాగిన కొద్దిసేపటికే రక్తంలో చక్కెర స్థాయి కొంత మేర పెరిగే అవకాశం ఉంటుంది. కొబ్బరి నీటిలో తక్కువ కేలరీలు ఉన్నా.. ఒక్క కప్పు అంటే సుమారుగా 240 మిల్లీలీటర్లలో 6 నుంచి 7 గ్రాముల వరకు సహజ చక్కెరలు ఉండే అవకాశం ఉంటుంది. అయితే దీని గ్లైసెమిక్ సూచిక తక్కువగా ఉంటుంది. అంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిని వేగంగా కాకుండా.. తక్కువ వేగంతో పెంచుతుంది. ఇదే కారణంగా కొబ్బరి నీటిని మితంగా తీసుకుంటే మధుమేహం ఉన్నవారికి పెద్ద హానీ కలగదు. మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీళ్లను పూర్తిగా మానుకోవాల్సిన అవసరం లేదు. కానీ మితంగా తీసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా వ్యాయామం చేసిన తర్వాత లేదా శరీరం నీటిని కోల్పోయినప్పుడు కొబ్బరి నీళ్లను తీసుకుంటే అది శక్తిని అందించడంలో సహాయపడుతుంది. అలాగే ఇందులో ఉండే పొటాషియం రక్తపోటు నియంత్రణలో సహాయపడుతుంది. దీనివల్ల హృదయ ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల శరీరంలో ఉన్న హానికరమైన మూలకాలను తొలగించడంలో ఇది సహకరిస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా ఉపయోగపడుతుంది. కానీ మధుమేహం ఉన్నవారు దీన్ని రోజూ అధిక పరిమాణంలో తీసుకుంటే మాత్రం రక్తంలో గ్లూకోజ్ స్థాయి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే దీనిని నియంత్రిత పరిమాణంలో అవసరమైన సందర్భాల్లో మాత్రమే తీసుకోవాలి. కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివే.. అయితే మధుమేహం ఉన్నవారు దీన్ని తీసుకునేటప్పుడు ఆలోచించి, మితంగా, శరీర పరిస్థితులను గమనిస్తూ తీసుకుంటే మంచిది

ఉల్లి సాగుతో కోటి రూపాయలు సంపాదించిన రైతు



గత రెండు నెలలుగా ఉల్లి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం మేలు రకం కిలో ఉల్లి రూ.60 నుంచి రూ.70 పలుకుతుంది. సాధారణ ఉల్లి కిలో రూ.50 నుంచి రూ.60 కు విక్రయిస్తున్నారు. చిన్ని ఉల్లిగడ్డలు కిలో రూ.40 నుంచి రూ.50 పలుకుతున్నాయి. అయితే ఎప్పుడైనా ఉల్లి సాగు చేసే రైతులకు నష్టాలు మిగిలేవి. కానీ ఈసారి ఉల్లి సాగు చేసిన రైతులు కాస్త ఆనందంగా ఉన్నారు. అయితే కర్ణాటకకు చెందిన ఓ రైతు ఉల్లి పంటతోనే రూ.కోటి రూపాయలు సంపాదించినట్లు వార్తలు వస్తున్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో కూడా ఆ రైతు ఉల్లి సాగు చేసి, పంటను కాపాడుకుని, ఉల్లిని విక్రయించి తన అప్పులు తీర్చుకున్నట్లు చెబుతున్నారు. కర్ణాటకలోని ధార్వాడ జిల్లా సోటకనాల్ ఊళ్లో ప్రస్తుతం అందరు సంతోషంగా ఉన్నారు. దానికి కారణం ఆ ఊళ్లోని రైతులు చాలా మంది ఉల్లి సాగు చేయడం. ప్రస్తుతం ఉల్లికి భారీ ధర వారంతా తమ కష్టాన్ని మార్చిపోయి ఆనందంగా ఉన్నారు. ఆ గ్రామంలో ఎటు చూసినా ఉల్లిగడ్డలే కనిపిస్తున్నాయి. పొలాల్లో కనుచూపు మేర ఎర్రటి ఉల్లిపాయ రాశులు కనివిందు చేస్తున్నాయి. ఇదే గ్రామానికి చెందిన రుగీ అనే రైతు, ఆయన కుటుంబం తమకున్న 40 ఎకరాల విస్తీర్ణంలో ఉల్లి పెట్టారు. ఆ పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ఉల్లిగడ్డలు భూమి నుంచి బయటకు తీశారు. కాడాలు కోసేసి ఉల్లిని మార్కెట్ కు తరలించారు. ఉద్యోగులకు గుడ్ న్యూస్.. మీ వద్దకే రానున్న పీఎఫ్ అధికారులు..! ఇప్పటి వరకు దాదాపు 2500 క్వింటాల్లు ఉల్లిని మార్కెట్ కు తరలించి విక్రయించారు. సగటున క్వింటా రూ.4 వేలు చొప్పున విక్రయించారు. దీంతో రుగీ కుటుంబానికి ఉల్లి అమ్మగా కోటి రూపాయల ఆదాయం సమకురింది. రుగీ కుటుంబానికి గోధుమ, జొన్నలతో పాటు ఉల్లిపాయ సాగు చేస్తారు. అయితే వారికి ఉల్లి సాగులో ఎప్పుడైనా నష్టాలే వచ్చేవి. కానీ ఈసారి ధర బాగుండడంతో మంచి ఆదాయం వచ్చింది. అయితే ఆ కుటుంబం పంటను కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు కష్టపడాల్సి వచ్చింది. చివరికి వారి కష్టం ఫలించింది. దీంతో రుగీ ఆదర్శ రైతుగా మారిపోయారు. ఆయన స్ఫూర్తిగా సోటకనాల్ రైతులు భారీగా ఉల్లి సాగు చేస్తున్నారు. ఈసారి ఉల్లి పంట వేసిన రైతులకు ఆదాయం బాగుంటుందని వ్యాపారులు చెబుతున్నారు. మరో రెండు, మూడు నెలల వరకు ఉల్లి ధరలు తగ్గే అవకాశం లేదని వారు చెబుతున్నారు. రైతులు ఉల్లితో పాటు కూరగాయలు సాగు చేస్తే కూడా మంచి లాభాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

బెంగళూరు వాసులకు గుడ్ న్యూస్..

నవంబర్ 13న మెట్రో పింక్ లైన్ ప్రారంభం



బెంగళూరు వాసులకు గుడ్ న్యూస్. 10 రోజుల్లో మెట్రో పింక్ లైన్ ప్రజలకు అందుబాటులోకి రాబోతుంది. నగరంలో కీలక కానున్న బెంగళూరు మెట్రో 'పింక్ లైన్'లోని 7.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ (పైవంతెన మార్గం) మార్గాన్ని ప్రధాని నరేంద్ర మోదీ నవంబర్ 13న ప్రారంభించనున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. తప్పనిసరిగా ఉండాల్సిన నిర్వహణ అనుమతుల కోసం ఆరు నెలల పాటు నిలిచిపోయిన ఈ ప్రాజెక్టుకు ఎట్టకేలకు అనుమతులు ఇచ్చారు. దక్షిణ బెంగళూరులోని అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆరు రైళ్లను సిద్ధం చేసింది. ఈ మార్గానికి ఇప్పటికే 'కమిషనర్ ఆఫ్ మెట్రో రైల్ సేఫ్టీ' నుంచి భద్రతా అనుమతులు కూడా లభించాయి.బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్, రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే అధికారిక సమయ పట్టికను, ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ప్రకటించనుంది. మొత్తం 21.26 కిలోమీటర్ల పొడవున్న పింక్ లైన్‌లో 13.76 కిలోమీటర్ల భూగర్భ మార్గం, 7.5 కిలోమీటర్ల ఎలివేటెడ్ మార్గం ఉన్నాయి. కాలేన అగ్రహార నుంచి తవరకెరె వరకు ఉన్న ఎలివేటెడ్ విభాగం పూర్తిగా పూర్తయింది. నుంచి భద్రతా అనుమతిని కూడా పొందింది. ఈ మార్గంలోని ఆరు ప్రధాన స్టేషన్లతో మెట్రో సేవలు ప్రారంభం కానున్నాయి. నుంచి హైదరాబాద్‌కు 2 గంటలు.. చెన్నైకి 73 నిమిషాలు! బుల్లెట్ ట్రైన్ కారిడార్లకు ఆమోదం.. ఈ మార్గం అందుబాటులోకి రావడం వల్ల బన్నెరఘట్ట రోడ్డు, ఐఐఎంబీ జేపీ నగర్, జయదేవ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణించే వారికి ఎంతో ఉపశమనం కలగనుంది. ఈ ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. వర్షాకాలంలో అయితే ఇక్కడ కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ కావడం సర్వసాధారణంగా మారింది. మెట్రో సేవలు ప్రారంభం కావడం వల్ల ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా మార్గం అందుబాటులోకి వస్తుంది. కాలేన అగ్రహార నుంచి తవరకెరె వరకు ఉన్న మెట్రో మార్గాన్ని ప్రారంభించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 15న బెంగళూరుకు వస్తారని సీఎం పేర్కొన్నారు. అయితే ఇప్పుడు షెడ్యూల్ మారింది. ప్రధాని మోదీ నవంబర్ 15కి బదులుగా నవంబర్ 13న పింక్ లైన్ మెట్రో సేవలను ప్రారంభిస్తారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

నిరాశ పరిచిన ఐటీసీ త్రైమాసిక ఫలితాలు.. క్షీణించి సిగరెట్ బిజినెస్..!



ఐటీసీ లిమిటెడ్ రెండో త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. పెరిగిన ఖర్చుల కారణంగా 2026-27 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికానికి తన ఏకీకృత లాభం 18.45 శాతం తగ్గి రూ. 4,229.33 కోట్లకు చేరింది. కోల్‌కతా ప్రధాన కార్యాలయం కలిగిన ఈ కంపెనీ ఏడాది క్రితం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో రూ. 5,186.55 కోట్ల ఏకీకృత లాభాన్ని నమోదు చేసింది. 2027 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దీని కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ. 30,578.4 కోట్లుగా ఉంది. ఇది ఏడాది క్రితం రూ. 21,255.86 కోట్లతో పోలిస్తే 43.85 శాతం పెరిగింది. సిగరెట్-యేతర వ్యాపార విభాగాలన్నింటిలోనూ "బలమైన వృద్ధిని" చూసినట్లు ఐటీసీ తన ఆదాయ నివేదికలో పేర్కొంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల మధ్య, ఎఫ్ఎంసీజీ వ్యాపారం వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ రెండంకెల ఆదాయ వృద్ధిని నమోదు చేసిందని, ఈబీఐటీడీఏ మార్జిన్ గతేడాదితో పోలిస్తే 50 బేసిస్ పాయింట్లు పెరిగిందని వివరించింది అంతేకాకుండా పశ్చిమ ఆసియా నేతృత్వంలోని వాణిజ్య అంతరాయాలు ఉన్నప్పటికీ, ఐటీసీ పేపర్ విభాగంలో బలమైన పునరుద్ధరణ వేగాన్ని కనబరిచింది. వ్యవసాయ వ్యాపారం కూడా బలమైన వృద్ధిని సాధించింది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఐటీసీ మొత్తం ఖర్చులు రూ. 25,462.44 కోట్లుగా ఉన్నాయి. ఇది గతేడాదితో పోలిస్తే 69.6 శాతం పెరిగింది. ఇతర ఆదాయంతో సహా దాని మొత్తం ఏకీకృత ఆదాయ 27లో 42.33 శాతం పెరిగి రూ. 31,085.76 కోట్లుగా ఉంది. బెంగళూరు వాసులకు గుడ్ న్యూస్.. అక్టోబర్ 31న వందే భారత్ స్లీపర్ ట్రైన్ ప్రారంభం..! పెరుగుతున్న వ్యయ ఒత్తిళ్ల మధ్య కూడా ఐటీసీ లిమిటెడ్, ప్యాకేజ్డ్ ఫుడ్స్, నిత్యవసర వినియోగదారుల ఉత్పత్తుల వ్యాపారం సెప్టెంబర్ త్రైమాసికంలో బలమైన పనితీరును కనబరిచింది. బిస్కెట్లు, నూడుల్స్, ఉప్పు, స్నాక్స్, ఇతర కీలక కేటగిరీలు 20% కంటే ఎక్కువ వృద్ధిని సాధించి కంపెనీ సిగరెట్ వ్యాపారాన్ని అధిగమించాయి. ఎఫ్ఎంసీజీ-ఇతర విభాగం గతేడాదితో పోలిస్తే 19% ఏకీకృత ఆదాయ వృద్ధిని నమోదు చేసింది. గోధుమ పిండిని మినహాయించి చూస్తే ఈ వృద్ధి 23%కి పెరిగింది. ఈ విభాగంలో ఆదాయ వృద్ధి 14 త్రైమాసికాల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఇది వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ రెండంకెల వృద్ధిని నమోదు చేసింది. బిస్కెట్లు, స్నాక్స్, నూడుల్స్, మసాలాలు, ఉప్పు, ఫ్రోజెన్ స్నాక్స్, హోమ్‌కేర్ ఉత్పత్తులు, నోట్‌బుక్‌లు అన్నీ 20 శాతం కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేశాయి. పాల ఉత్పత్తులు, పర్సనల్ వాష్ ఉత్పత్తులు 11-19% మధ్య వృద్ధిని సాధించాయి. అన్ని కేటగిరీలలో ముడిసరుకుల ఖర్చులు విపరీతంగా పెరిగినప్పటికీ ఈ వృద్ధి నమోదైంది. ఉత్పత్తి మిశ్రమంలో మెరుగుదలలు, వ్యయ నిర్వహణ చర్యలు, క్రమబద్ధమైన ధరల నిర్ణయాల కలయిక ద్వారా ఈ ఒత్తిడిని అధిగమించినట్లు ఐటీసీ తెలిపింది. వడ్డీ, పన్నుకు ముందు విభాగం లాభం గత ఏడాదితో పోలిస్తే 28% పెరిగి, రూ. 437 కోట్ల నుంచి రూ. 558 కోట్లకు చేరింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఈ దీపావళికి జెఫరీస్, పిఎల్ క్యాపిటల్ సూచించిన స్టాక్స్ ఇవే..!



దీపావళికి ముందు పలు బ్రోకరేజ్ సంస్థలు స్టాక్స్ ను చూచిస్తుంటాయి. బ్రోకరేజ్ సంస్థ పిఎల్ క్యాపిటల్ పెట్టుబడి కోసం 10 స్టాక్‌లను సిఫార్సు చేసింది. ఈ కంపెనీల షేర్లు గణనీయంగా పెరిగే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని పేర్కొంది. ఈ స్టాక్‌ల జాబితాను దీర్ఘకాలిక పెట్టుబడి కోసం ఎంపిక చేశారు. పెట్టుబడిదారులకు మెరుగైన అవగాహన కోసం షేర్ టార్గెట్ ధరలను కూడా అందించారు. నిర్దిష్ట స్టాక్‌లపై 'బై రేటింగ్' ప్రారంభిస్తూ, బ్రోకరేజ్ ప్రతి స్టాక్‌కు టార్గెట్ ధర, స్టాప్-లాస్‌ను అందించింది. టార్గెట్ ధర అనేది ఒక కౌంటర్ ఎంత స్థాయికి పెరుగుతుందని బ్రోకరేజ్ అంచనా వేస్తుందో ఆ స్థాయి. స్టాప్-లాస్ అనేది ఒక ధర స్థాయి, ఒకవేళ స్టాక్ ధర ఆ స్థాయి కంటే తక్కువకు పడిపోతే.. నష్టాలను పరిమితం చేయడానికి పెట్టుబడిదారులు ఆ స్థాయి వద్ద తమ పొజిషన్ నుండి నిష్క్రమించడాన్ని పరిగణించవచ్చు. పీఎల్ క్యాపిటల్ అపోలో హాస్పిటల్స్, డీఎల్ఎఫ్, జీఈ వెర్నోవ, హెచ్ బీఎల్ ఇంజినీరింగ్, జిందాల్ స్టీల్, మెరైన్ ఎలక్ట్రికల్స్, శిల్పా మెడికేర్ స్టాక్స్ ను సూచించింది. దీపావళి, లక్ష్మీ పూజ సందర్భంగా భారత స్టాక్ మార్కెట్ ఆదివారం, నవంబర్ 08, 2026న ముహూర్త ట్రేడింగ్‌ను నిర్వహిస్తుంది. ఈసారి ముహూర్త ట్రేడింగ్ సెషన్ మధ్యాహ్నం 2:20 నుంచి 3:30 వరకు జరుగుతుంది. దీపావళి సందర్భంగా మార్కెట్లు మూసి ఉంటాయి. అయితే ప్రతి సంవత్సరం ముహూర్త ట్రేడింగ్ కోసం మార్కెట్లు తెరుచుకుంటాయి. ఒక శుభ సమయంలో (ముహూర్తం) మార్కెట్లు పరిమిత కాలం పాటు తెరుచుకుంటాయి. ఇది కొత్త సంవత్సరం (హిందూ క్యాలెండర్ సంవత్సరం) ప్రారంభంలో స్టాక్‌లను ట్రేడ్ చేయడానికి పెట్టుబడిదారులకు వీలు కల్పిస్తుంది. హైదరాబాద్‌లో తగ్గిన టపాసుల అమ్మకాలు.. దీపావళి వేళ కొనుగోళ్లకు దూరంగా వినియోగదారులు.. ప్రపంచ బ్రోకరేజ్ సంస్థ అంచనా ప్రకారం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ షేర్లు పెరిగే అవకాశం ఉంది. ఎందుకంటే, 27, 29 మధ్య ఎక్స్ఛేంజ్ నిర్వహణ రాబడి 15 శాతం సమ్మేళన వార్షిక రేటుతో వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. అలాగే 30 నాటికి కొత్త వ్యాపారాలు ఆదాయాలకు మరో 15 శాతం జోడించే అవకాశం ఉంది. గతంలో నియంత్రణపరమైన అడ్డంకులు ఉన్నప్పటికీ 27-29వ మధ్య కాలంలో ఆదాయం 15% వృద్ధిని సాధిస్తుందని అంచనా వేస్తున్నామని జెఫరీస్ తన నివేదికలో పేర్కొంది. ఈ బ్రోకరేజ్ సంస్థ అంచనా ప్రకారం నిర్వహణ ఆదాయం 26లో రూ. 166,013 కోట్ల నుం 27లో రూ. 173,929 కోట్లకు, 28లో రూ. 198,442 కోట్లకు, 29లో రూ. 230,294 కోట్లకు పెరుగుతుంది. జెఫరీస్, ఎన్ఎస్ఈ షేరు ధర లక్ష్యాన్ని రూ. 2,085గా అంచనా వేసింది. రాడికో ఖైతాన్ పై కూడా జెఫరీస్ బుల్లిష్ గా ఉంది. ఈ మద్యం తయారీ సంస్థ బలమైన వృద్ధి, మెరుగైన ఉత్పత్తి మిశ్రమం, పెరిగిన మార్జిన్‌ల కారణంగా స్టాక్ పెరుగుతుందని జెఫరీస్ అభిప్రాయపడింది. జెఫరీస్, రాడికో ఖైతాన్ షేర్లను రూ. 5,200 లక్ష్య ధరతో కొనుగోలు చేయమని సలహా ఇచ్చింది. ఇవి కేవలం బ్రోకరేజ్ లు సిఫార్సులు మాత్రమే.. కచ్చితమైన హామీ కాదని గుర్తుంచుకోవాలి. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

లిస్టింగ్ నుంచి దూసుకెళ్తోన్న జియో ప్లాట్ ఫారమ్స్ షేర్లు..!



జియో ప్లాట్ ఫారమ్స్ షేర్లు గత వారం బలమైన లిస్టింగ్ తర్వాత శుక్రవారం తన మొదటి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. దీంతో సోమవారం ట్రేడింగ్ సెషన్‌లో కంపెనీ షేర్ ధర 3 శాతం వరకు పెరిగింది. జియో ప్లాట్‌ఫారమ్స్ షేర్లు ఈరోజు 1,465 వద్ద ప్రారంభమై.. గరిష్టంగా రూ.1,475 స్థాయిని తాకాయి. అక్టోబర్ 28న స్టాక్ మార్కెట్‌లో అడుగుపెట్టిన జియో ప్లాట్‌ఫారమ్స్ అప్పుడు రూ.1,358 వద్ద లిస్ట్ అయింది. ఇది ఐపీఓ ధర రూ.1,119తో పోలిస్తే 21.36% ప్రీమియంలో లిస్ట్ అయింది. సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి, జియో ప్లాట్‌ఫారమ్స్ తన ఏకీకృత నికర లాభంలో గత ఏడాదితో పోలిస్తే 14% వృద్ధిని నమోదు చేసి, రూ.8,389 కోట్లకు చేరుకుంది. స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన తర్వాత కంపెనీ ప్రకటించిన మొదటి త్రైమాసిక ఫలితాలు ఇవే. చందాదారుల సంఖ్య గణనీయంగా పెరగడం, డిజిటల్ సేవల వ్యాపారం విస్తరించడం, ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం స్వల్పంగా మెరుగుపడ్డాయి. కంపెనీ నిర్వహణ ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 11 శాతం పెరిగి రూ.36,332 కోట్ల నుంచి రూ.40,475 కోట్లకు చేరుకుంది. జూన్ త్రైమాసికంతో పోలిస్తే నికర లాభం 8 శాతం పెరగ్గా.. ఆదాయం 3 శాతం వృద్ధిని నమోదు చేసింది. అధిక ఆదాయం, నిర్వహణ సామర్థ్యం, మెరుగైన మార్జిన్ల కారణంగా, ఈ త్రైమాసికంలో కంపెనీ ఎబిట్డా 17% వృద్ధి చెందింది. బలమైన త్రైమాసిక ఫలితాలతో దూసుకెళ్లిన రిలయన్స్ షేర్లు..! ఎబిట్డా మార్జిన్ 250 బేసిస్ పాయింట్లు పెరిగి 54.1%కి చేరుకుంది. అదే సమయంలో క్యూ2లో శూన్యాకాశ స్వల్పంగా పెరిగి రూ.218.8కి చేరింది. అయితే ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల కోసం అందించిన ప్రమోషనల్ ఆఫర్లు, పెరిగిన డేటా వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను కొంతవరకు తగ్గించాయి. నిర్వహణ పరంగా చూస్తే ఒక్కో వినియోగదారుడి నెలవారీ డేటా వినియోగం 44.2 డీగా నమోదైంది. సెప్టెంబర్ త్రైమాసికంలో మొత్తం డేటా ట్రాఫిక్ గత ఏడాదితో పోలిస్తే 22 శాతం పెరిగింది. నెలవారీ సబ్‌స్క్రైబర్ చర్న్ 1.6% వద్ద స్థిరంగా ఉంది. ఈ కాలంలో జియో 9.1 మిలియన్ల నికర సబ్‌స్క్రైబర్‌లను చేర్చుకుంది. సెప్టెంబర్ చివరి నాటికి జియో 5 సబ్‌స్క్రైబర్ల సంఖ్య 30 కోట్లకు చేరుకుంది. గత 12 నెలల్లో 6.6 కోట్ల మంది వినియోగదారులు కొత్తగా చేరారు. కస్టమర్ ఎంగేజ్‌మెంట్ బలంగా కొనసాగింది. కంపెనీ మొత్తం వైర్‌లెస్ డేటా ట్రాఫిక్‌లో 56 శాతం వాటా 5 వినియోగదారులదే. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

బ్యాంక్ ఆఫ్ ఇండియా.. వడ్డీ రేట్లు పెంపు..!



బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిక్స్‌డ్ డిపాజిట్ దారులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించింది. రూ.3 కోట్ల లోపు రూ.3 కోట్ల నుంచి రూ.10 కోట్ల లోపు ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ల పై, ఎంపిక చేసిన మధ్యకాలిక, దీర్ఘకాలిక కాలపరిమితులలో వడ్డీ రేట్లను పెంచింది. ఈ సవరించిన రేట్లు నవంబర్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రభుత్వ రంగ బ్యాంకు 500 రోజుల కాలపరిమితితో స్టార్ అక్షయ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ అనే ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని కూడా ప్రవేశపెట్టింది. ఈ పథకం సాధారణ ఖాతాదారులకు సంవత్సరానికి 6.85 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.35 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.50 శాతం వడ్డీ రేటును చెల్లిస్తోంది. రూ.3 కోట్ల లోపు డిపాజిట్లపై బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక సంవత్సరం కాలపరిమితి గల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేటును సంవత్సరానికి 6.60 శాతానికి పెంచింది. ఒక సంవత్సరం కంటే ఎక్కువ, మూడు సంవత్సరాల కంటే తక్కువ కాలపరిమితి గల డిపాజిట్లపై ఇప్పుడు 6.70 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. 180 రోజుల నుంచి మూడు సంవత్సరాల లోపు కాలపరిమితి గల డిపాజిట్లపై, సీనియర్ సిటిజన్లు ప్రస్తుత రేటుపై అదనంగా 0.50 శాతం పాయింట్ల వడ్డీని పొందుతుండగా, సూపర్ సీనియర్ సిటిజన్లు అదనంగా 0.65 శాతం పాయింట్ల వడ్డీని పొందుతారు. రూ.3 కోట్ల నుంచి రూ.10 కోట్ల లోపు డిపాజిట్లపై, ఎంపిక చేసిన మెచ్యూరిటీ బకెట్‌లకు బ్యాంక్ రేట్లను కూడా సవరించింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ దారులకు గుడ్ న్యూస్.. వడ్డీ రేట్లు పెంచిన ఐసీఐసీఐ బ్యాంకు..! ఒక సంవత్సరం కాలపరిమితి గల డిపాజిట్లపై వడ్డీ రేటును సంవత్సరానికి 6.55%కి పెంచగా, ఒక సంవత్సరం కంటే ఎక్కువ, మూడు సంవత్సరాల లోపు కాలపరిమితి గల డిపాజిట్లపై 6.65% వడ్డీ లభిస్తుంది. ఒక సంవత్సరం నుంచి మూడు సంవత్సరాల వరకు కాలపరిమితిపై రూ.1 కోటి కంటే ఎక్కువ ఉన్న నాన్-కాల్‌బుల్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అదనంగా 0.15 శాతం పాయింట్ల వడ్డీ అందుబాటులో ఉంది. నాన్-కాల్‌బుల్ డిపాజిట్లపై గడువుకు ముందే డబ్బు ఉపసంహరించుకునే సౌకర్యం ఉండదు. ఎఫ్డీలపై రుణం, గడువుకు ముందే డబ్బు ఉపసంహరించుకునే సౌకర్యాలు కేవలం కాల్‌బుల్ డిపాజిట్లపై మాత్రమే అందుబాటులో ఉన్నాయని బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. కస్టమర్లు ఏదైనా బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో లేదా ఓమ్ని నియో మొబైల్ అప్లికేషన్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్లను తెరవవచ్చు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

నెలకు రూ.12,500 పెట్టుబడితో రూ.71,82,119 సొంతం చేసుకోవచ్చు..!



ఆడ పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై భయంతో ఉంటారు. వారి చదువు, తర్వాత పెళ్లి కోసం సంపాదించాలని ఆరాటపడుతుంటారు. అయితే ఆడ పిల్లల కోసం కేంద్రం ఒక పథకం తీసుకొచ్చింది. అదే సుకన్య సమృద్ధి యోజన. ఈ పథకం కింద తక్కువ మొత్తంలో పొదుపు చేసి ఎక్కువ మొత్తంలో పొందవచ్చు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు మీ కోసం. సుకన్య సమృద్ధి యోజన పథకంలో పుట్టిన పిల్లల న

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
బుధవారం 04 - 11 - 2026

ఎన్టీఆర్ 'డ్రాగన్'కు ఇద్దరు సంగీత దర్శకులా .. అసలు కథేంటి?



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'డ్రాగన్'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన నాలుగు నిమిషాల నిడివి ఉన్న గ్లింప్సు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ముఖ్యంగా ఎన్టీఆర్ పాత్ర తీరు, ఆయన చెప్పిన పవర్‌ఫుల్ డైలాగులు అభిమానులను ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించిన మరో ఆసక్తికరమైన వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్ వర్గాల్లో చర్చకు దారితీసింది. 'డ్రాగన్' చిత్రానికి ఇప్పటికే సంగీత దర్శకుడు రవి బసూర్ పనిచేస్తున్నారనే ప్రచారం ఉంది. అయితే తాజాగా మరో సంగీత దర్శకుడు తశ్వత్ సచ్‌దేవ్ పేరు తెరపైకి రావడంతో కొత్త చర్చ మొదలైంది. రవి బసూర్ స్థానంలో శశ్వత్ సచ్‌దేవ్‌ను తీసుకుంటున్నారా? లేక ఈ భారీ ప్రాజెక్ట్‌కు ఇద్దరు సంగీత దర్శకులు కలిసి పనిచేయబోతున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ ఇద్దరూ ఈ సినిమాకు సంగీతం అందిస్తే ప్రేక్షకులకు సరికొత్త సంగీత అనుభూతి లభించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రవి బసూర్ మాస్ నేపథ్య సంగీతం, శశ్వత్ సచ్‌దేవ్ విభిన్నమైన సంగీత శైలి కలిస్తే తెరపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్ సన్నివేశాలతో పాటు నేపథ్య సంగీతానికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ముఖ్యంగా భారీ యాక్షన్ సన్నివేశాలను మరింత ప్రభావవంతంగా చూపించడంలో సంగీతం కీలక పాత్ర పోషిస్తుంది. 'డ్రాగన్' కథలోనూ భావోద్వేగాలు, యాక్షన్ ప్రధానంగా ఉండనున్నాయనే ప్రచారం నేపథ్యంలో సంగీతంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని టాక్. 1967 నాటి ఆఫ్ఘనిస్తాన్ పరిస్థితుల నుంచి గోల్డెన్ ట్రయాంగిల్ వరకు సాగే కథాంశంతో ఈ సినిమా రూపొందుతోందని వార్తలు వస్తున్నాయి. ఇలాంటి నేపథ్యానికి తగ్గట్టుగా సంగీతం, నేపథ్య స్వరాలు ఉండటం చాలా ముఖ్యమని సినీ అభిమానులు భావిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వార్ 2'తో ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయిన ఎన్టీఆర్.. 'డ్రాగన్'తో మరోసారి పాన్ ఇండియా స్థాయిలో తన సత్తా చాటాలని అభిమానులు కోరుకుంటున్నారు. అందుకే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. అయితే రవి బసూర్, శశ్వత్ సచ్‌దేవ్ ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారా? లేక సంగీత దర్శకుడి విషయంలో మార్పు జరిగిందా? అనే అంశాలపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాలేదు.



పవన్ కల్యాణ్ 33వ సినిమాకు రంగం సిద్ధం..

దర్శకుల రేసులో అనిల్ రావిపూడి, వంశీ పైడిపల్లి..!

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజాసేవ, పాలనా వ్యవహారాల్లో బిజీగా ఉన్న పవర్ స్టార్ పవన్ కల్యాణ్ మళ్లీ వెండితెరపై సందడి చేయనున్నారనే దాని గురించి టాలీవుడ్‌లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. రాజకీయాల్లో కీలక బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ సినిమాలకు దూరమవుతారని చాలామంది భావించారు. అయితే తన అభిమానుల కోసం మరో చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు ఆయన సిద్ధమవుతున్నారనే ప్రచారం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. పవన్ బెరీడ్‌లో 33వ సినిమాగా ఈ ప్రాజెక్ట్ తెరకెక్కనుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత దిల్ రాజు తన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థపై నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో పవన్ కల్యాణ్, దిల్ రాజు కలయికలో వచ్చిన 'వకీల్ సాబ్' మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో పవన్ నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు మరోసారి ఈ ఇద్దరూ కలిసి పనిచేయబోతున్నారనే వార్త అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తన రాజకీయ, పాలనా బాధ్యతలకు ఇబ్బంది కలగకుండా పవన్ ఈ సినిమా కోసం ప్రత్యేకంగా కాల్షీట్లు కేటాయించనున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పవన్ 33వ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ప్రాజెక్ట్ కోసం ఇద్దరు ప్రముఖ దర్శకుల పేర్లు వినిపిస్తున్నాయి. వారిలో ఒకరు అనిల్ రావిపూడి కాగా, మరొకరు వంశీ పైడిపల్లి. కమర్షియల్ ఎంటర్‌టైనర్లతో పరుస విజయాలు అందుకుంటున్న అనిల్ రావిపూడి ప్రస్తుతం వెంకటేశ్, కల్యాణ్ రామ్ కలయికలో తెరకెక్కనున్న మల్టీస్టారర్ పనుల్లో బిజీగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు వంశీ పైడిపల్లి బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్‌తో సినిమా చేస్తున్నారు. ఈ ఇద్దరిలో పవన్ సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనే దానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ సినిమాలో పవన్ సరసన నటించే హీరోయిన్ విషయంలోనూ పలు పేర్లు తెరపైకి వస్తున్నాయి. 'సప్త సాగరదాచే ఎల్లో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన రుక్మిణి వసంత్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమ ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమాలోనూ నటిస్తున్నారు. మరోవైపు 'ది రాజా సాబ్'తో ప్రేక్షకులను పలకరించనున్న మాళవిక మోహనన్ పేరును కూడా పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వీరిలో ఎవరినైనా హీరోయిన్‌గా ఎంపిక చేశారా? లేదా? అనే విషయంపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక సమాచారం లేదు. పవన్ కల్యాణ్ 33వ సినిమాకు సంబంధించిన వార్తలు ప్రస్తుతం అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. దర్శకుడు, హీరోయిన్, చిత్రీకరణ ప్రారంభ తేదీ, కథాంశం వంటి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



నాతో క్షమాపణలు చెప్పించారు.. ఇప్పుడు అవే పనులు బహిరంగంగా చేస్తున్నారు: అనుపమ ఆవేదన!

ప్రముఖ టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ సోషల్ మీడియా వేదికగా పెట్టిన ఒక ఆవేదనభరితమైన పోస్ట్ ప్రస్తుతం సినీ వర్గాల్లోనూ, నెట్టింటనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సమాజంలో మరియు ఆన్‌లైన్ వేదికలపై మనుషుల ప్రవర్తనలో కనిపిస్తున్న డబుల్ స్టాండర్డ్స్ తనను ఎంతగానో బాధిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. ఎవరి పేర్లను నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఆమె పంచుకున్న ఆ భావోద్వేగపు మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఒకప్పుడు తాను చేసిన కొన్ని చిన్న చిన్న పనులను లేదా సాధారణమైన విషయాలను తీవ్రంగా తప్పుపట్టి, తనను నిందితులుగా భావించేలా చేసిన కొందరు వ్యక్తులే.. ఇప్పుడు అదే పరిస్థితుల్లో పాత్రలు తారుమారైనప్పుడు అవే పనులను బహిరంగంగా చేస్తుండటం విచిత్రంగా ఉందని ఆమ ఎత్తిచూపారు. సంతోషంగా ఉండటం, ఇష్టమైన వారిని మనసారా మెచ్చుకోవడం వంటి చిన్న విషయాలను కూడా కొందరు కావాలనే తప్పుగా చిత్రీకరించారని, పదేపదే ఇతరులకు వివరణలు ఇచ్చుకునేలా చేసి తనను క్షమాపణలు చెప్పే దయనీయ స్థితికి నెట్టారని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, గతంలో తాను చేస్తే తప్పుగా చూపించిన అవే పనులను ఇప్పుడు ఇతరులు ఎలాంటి మొహమాటం, సంకోచం లేకుండా బహిరంగంగా చేస్తున్నారని ఆమె అన్నారు. దీన్ని బట్టి చూస్తే సమస్య అసలు మనం ఏం చేశామన్నది కాదని, అది ఎవరు చేశారన్నదే ఇక్కడ ముఖ్యం అని తనకు స్పష్టంగా అర్థమైందని అనుపమ వాపోయారు. ఇక ఇదే సమయంలో తన సోషల్ మీడియా ఫాలోవర్స్ మరియు నెటిజన్లకు ఆమె ఒక విజ్ఞప్తి చేస్తూ.. తాను ఎవరి కామెంట్‌కు రిప్లై ఇచ్చానో బేరీజు వేస్తూ విశ్లేషణలు చేయవద్దని, అనవసరమైన ట్యాగ్‌లు, మెసేజ్‌లతో తనను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. తనకు సోషల్ మీడియా ప్రపంచానికి అతీతంగా నిజ జీవితంలో ఎన్నో సొంత బాధ్యతలు, వ్యక్తిగత పోరాటాలు ఉన్నాయని, కేవలం సోషల్ మీడియాలో ఆన్‌లైన్ ఇమేజ్ కోసం నటిస్తూ బతకలేనని ఆమ కుండబద్దలు కొట్టారు. కొద్ది రోజుల క్రితం తాను ఒక ప్రేమ వ్యవహారం మరియు వ్యక్తిగత కారణాల వల్ల తీవ్రమైన మానసిక ప్రశాంతత కోల్పోయానని అనుపమ స్వయంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సరిగ్గా అదే కోణంలో ఆమె ఈ తాజా పోస్ట్ పెట్టడంతో, అసలు ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి చేశారనే దానిపై నెటిజన్లు రకరకాలుగా చర్చించుకుంటూ సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ చేస్తున్నారు.



ప్రభాస్ 'ఫౌజీ' షూటింగ్‌పై కీలక అప్‌డేట్.. నవంబర్ 3 నుంచి మళ్లీ సెట్స్‌లోకి పాన్ ఇండియా స్టార్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస భారీ చిత్రాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఉండగా, వాటిలో దర్శకుడు హను రాఘవపూడితో చేస్తున్న 'ఫౌజీ' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. కొంతకాలం విరామం తర్వాత ఈ సినిమా చిత్రీకరణను తిరిగి ప్రారంభించేందుకు ప్రభాస్ సిద్ధమయ్యారు. ప్రస్తుతం 'కల్కి 2' చిత్రీకరణలో పాల్గొంటున్న ప్రభాస్.. త్వరలోనే 'ఫౌజీ' సెట్స్‌లోనూ అడుగుపెట్టనున్నారు. నవంబర్ 3, 2026 నుంచి ఈ సినిమా షూటింగ్ తిరిగి ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇప్పటికే చిత్రీకరణ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో మిగిలిన భాగాన్ని త్వరగా పూర్తి చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'ఫౌజీ' గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని పెంచింది. ప్రభాస్ లుక్, సినిమా నేపథ్యం, యాక్షన్ అంశాలు అభిమానులను ఆకట్టుకున్నాయి. దీంతో ఈ సినిమా ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. హను రాఘవపూడి ఈ సినిమాను పీరియాడిక్ నేపథ్యంలో భారీ చారిత్రక యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. సాధారణ కమర్షియల్ కథలకు భిన్నంగా చారిత్రక నేపథ్యం, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ఫౌజీ' చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా బడ్జెట్ రూ.700 కోట్లకు పైగా ఉంటుందని వార్తలు వినిపిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రభాస్ పాన్ ఇండియా క్రేజ్, హను రాఘవపూడి దర్శకత్వ శైలి, భారీ తారాగణం సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం 'ఫౌజీ' చిత్రాన్ని 2027 మార్చి 19న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళిక సిద్ధం చేసింది. షూటింగ్ తిరిగి ప్రారంభం కానుండటంతో నిర్మాణ పనుల్లో వేగం పెరగనుంది. అయితే చిత్రీకరణ, ఇతర నిర్మాణానంతర పనులు అనుకున్న సమయానికి పూర్తయితేనే ఈ విడుదల తేదీ సాధ్యమవుతుంది.

M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.